Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

బుధవారం, మే 06, 2026 | సంపుటి - 20 | సంచిక 230 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## మైనర్ల ట్రాప్ కేసులో సంచలన విషయాలు

### ఇన్‌స్టా వేదికగా వల విసరి లోబర్చుకున్న బ్రదర్స్

ఖరీదైన కార్లలో తిప్పుతూ అత్యాచారాలు

కేసులో ఆజాద్ తల్లి, మేనమామల అరెస్ట్

వివరాలు వెల్లడించిన కమిషనర్ సజ్జన్నార్



హైదరాబాద్ : జూబ్లీహిల్స్ బాలికల ట్రాప్, చీటింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు.. 19 మంది మైనర్లను ట్రాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిందితులను విచారించామని.. ఈ విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. 2లో



2

### తెలుగు రాష్ట్రాలకు
## వర్ష హెచ్చరిక

ఉపరితల ద్రోణితో పిడుగులతో కూడిన వర్షాలు

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణశాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశ ముందని తెలిపింది. తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగు తోందని అధికారులు వెల్లడించారు.



### శాసనసభా పక్ష నేతగా
## విజయ్ ఎన్నిక

**ప్రభుత్వం ఏర్పాటుపై సమావేశంలో చర్చ**

**మెజార్టీ కోసం గవర్నర్‌ను15 రోజులు గడువు కోరిన టివికె**

**పొత్తు కోసం ఎవరినీ అడుక్కోబోమని స్పష్టీకరణ**

చెన్నై : తమిళనాడులో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే పార్టీ మెజారిటీకి కొద్ది దూరంలో ఉంది. ఇదే సమయంలో పార్టీ లెజిస్లేటివ్ లీడర్‌గా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ ప్రకటించింది. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. తరువాయి 2లో



2

### ఇచ్చిన హామీలకు.. పాలనకు
## పొంతన లేదు

కాంగ్రెస్ సర్కార్‌ను సాగనంపడమే ఉత్తమం

గజ్వేల్ బిజెపి సభలో ఈటెల రాజేందర్ వ్యాఖ్య

### కాళేశ్వరంపై సిబిఐ విచారణ
# ఎందుకు చేయరు




బిఆర్‌ఎస్‌తో బిజెపి కుమ్మక్కు రాజకీయాలకు నిదర్శనం

కేంద్రమంత్రులు బండి, కిషన్ రెడ్డిలు సమాధానం చెప్పాలి

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్

హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతిపై సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతుందో సమాధానం చెప్పాలని తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారని.. ఆ లోపు దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయం లో సీబీఐ దర్యాప్తుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి అనే ఫీలింగే రావటం లేదని చెప్పారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. వేల కోట్ల అవినీతికి పాల్పడిందని విమర్శించారు. అలాగే రూ. వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని ఆరోపించారు. 2లో





### బెంగాల్, అసోంలలో
## ఓట్ చోరీ

జనాదేశాన్ని చోరీచేసిన బిజెపి

మరోమారు రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ : బెంగాల్, అసోంలో ఓటు చోరీ జరగిందని విపక్షనేత రాహుల్ మరోమారు ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఓటమి చెందడంతో కొందరు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జనాదేశాన్ని బీజేపీ చోరీచేసిందని ఆరోపించారు. తరువాయి 2లో



### బిఆర్‌ఎస్, బిజెపి
## కుమ్మక్కు రాజకీయాలు

కాళేశ్వరంపై సిబిఐ విచారణ ఎందుకు తొక్కి పెట్టారు

వరంగల్ రైతుమేళా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

హనుమకొండ : బిఆర్‌ఎస్, బిజెపిలవి కుమ్మక్కు రాజకీయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండి పడ్డారు. బిఆర్‌ఎస్‌తో కుమ్మక్కు కాకపోతే కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదన్నారు. మోడీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చేలోగా సిబిఐ విచారణకు ఆదేశించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని విమర్శించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ.21వేల కోట్లు చెల్లించామని చెప్పారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తరువాయి 2లో



## ప్రధాని పర్యటనలో భారీ భద్రత

కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

అధికారులతో సమీక్షలో సిఎస్ ఆదేశం

హైదరాబాద్ : ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మే 10వ తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా పరంగా కట్టుదిట్టటైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఆదేశించారు. అలాగే తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. 2లో



2

### మక్కల కొనుగోళ్లలో
## కావాలనే జాప్యం

**రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం**

**నేటిలోగా సమాధానం రాకపోతే ఆందోళన తీవ్రం**

**ప్రభుత్వాన్ని హెచ్చరించిన కెటిఆర్**

జనగామ : రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించారని, అయితే ఆ మేరకు కొనుగోలు ప్రణాళికలు రూపొందించలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం కేవలం 10 లక్షల టన్నుల పంటను మాత్రమే కొనుగోలు చేయాలని భావిస్తోందని, మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు.

### బెంగాల్లో నేను ఓడిపోలేదు
## రాజీనామా చేయను

బిజెపి కుట్రలతో గెలిచింది..

తొత్తుగా మారిన ఎన్నికల సంఘం

ప్రధాన విలన్ ఎన్నికల కమిషనర్..

మమతా బెనర్జీ వ్యాఖ్యలు



కోల్‌కతా : పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. లోక్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో 2లో



## రైల్వేజోన్ ఏర్పాటుపై సిఎం చంద్రబాబు హర్షం

చిరకాల స్వప్నం నెరవేరిందని ఎక్స్‌లో పోస్ట్

అమరావతి : విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్‌ను విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని తెలిపారు. మంగళవారం విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వ గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్‌ను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియ జేస్తున్నట్లు చెప్పారు. 2026, జూన్ 1వ తేదీ నుంచి విశాఖపట్నం కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస - ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ద్వారా ఉత్తరాంధ్ర రవాణా రంగం ముఖచిత్రాన్ని మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తరువాయి 2లో


## ఐపిఎస్ విశాల్ గున్నికి హైకోర్టు షాక్

క్యాట్ ఉత్తర్వులపై స్టే విధిస్తూ ఆదేశం

తదుపరి విచారణ ఆగస్ట్ 29కి వాయిదా

అమరావతి : ఐపీఎస్ అధికారి విశాల్ గున్నికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు షాక్ ఇచ్చింది. క్యాట్ ఉత్తర్వులపై స్టే విధించింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. సినీ నటి కాదంబరి జత్వాని అక్రమ అరెస్ట్, అధికార దుర్వినియోగం కేసులో విశాల్ గున్నిని ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ అంశంపై విశాల్ గున్ని క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే విశాల్ గున్ని సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేసి ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకుని పోస్టింగ్ ఇవ్వాలని గత ఏడాది ఆగస్టు 28వ తేదీన క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. 2లో

### రాజధాని ప్రాంతంలో
# మౌలిక వసతులు



రైతుల సమస్యలకు తొలి ప్రాధాన్యం

త్రీమెన్ కమిటీ సమవేశంలో నిర్ణయం

కేంద్రమంత్రి పెమ్మసాని వెల్లడి

అమరావతి : రాజధాని ప్రాంతంలో గ్రామీణ రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని తెలిపారు. మంత్రి నారాయణ, కమిషనర్‌లు, జాయింట్ కమిషనర్లు కూడా ఫీల్డ్ విజిట్‌లు చేపట్టాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే దిశగా 2లో

# మైనర్ల ట్రాప్ కేసులో సంచలన విషయాలు

జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో మూడుగంటల పాటు నిందితులను సీపీ ప్రశ్నించారు. అర్జున్ అలియాస్ చంద్రశేఖర్ ఆజాద్, ప్రవీణ్‌లను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకున్నట్లు చెప్పారు.రిచ్ కిడ్స్‌ను అర్జున్, ఆయన సోదరుడు ప్రవీణ్ టార్గెట్ చేశారని సజ్జనార్ వెల్లడించారు. మైనర్లను ట్రాప్ చేసి ఖరీదైన కార్లలోనే లైంగిక చర్యలకు అర్జున్ పాల్పడ్డాడని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎస్కార్ట్‌గా ఉంటూ మైనర్లకు వల విసిరారని చెప్పారు. అర్జున్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో 150 మంది అమ్మాయిలు ఫాలో అవుతున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం అర్జున్ ప్రొఫైల్‌ను తాము లాక్ చేశామని తెలిపారు. ఇద్దరు నిందితులకు వారి తల్లి మీనాకుమారి కూడా సహకరించినట్లుగా గుర్తించామని అన్నారు. నిందితుల కుటుంబం గుంటూరుకు చెందినదిగా తమ దర్యాప్తులో తేలిందన్నారు. బాలికలు అట్రాక్ట్ అయ్యేలా ఇన్‌స్టాగ్రామ్‌లో అర్జున్ రీల్స్ చేశాడని అన్నారు. ఇక్కడి నుంచి బాలికలను ట్రాప్ చేసి రిచ్‌గా కారులో షికారు అంటూ హైదరాబాద్ రోడ్లపై అర్జున్ అన్నదమ్ములు తిప్పారని చెప్పారు. తమతో ఫిజికల్ రిలేషన్ పెట్టుకునేలా బాలికలపై ఒత్తిడి చేశారన్నారు. ఆ వీడియోలను కూడా నిందితులు రికార్డు చేశారని.. సమయం చూసి తాము ఓ బిజినెస్ మొదలుపెడతామని బాధితులను నమ్మించి డబ్బు అడిగేవారని తెలిపారు. అలా ఓ బాలిక ఇంట్లో తెలియకుండా రూ. 13 లక్షలను నిందితులకు ఇచ్చిందన్నారు. గత ఏడాది కూడా ఇలాగే మరో మైనర్‌ను అర్జున్ ట్రాప్ చేశారని తెలిపారు. ఈ కేసులో మూడు రోజుల పాటు జైల్లో ఉండి ఆయన బయటకు వచ్చారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇకపోతే యువతులను బెదిరించి డబ్బులు కాజేసిన ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఆజాద్ తల్లితోపాటు మేనమామను జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖరీదైన కార్లలో తిరుగుతున్న ఫొటోలను ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఆజాద్.. స్టార్టప్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. యువతులకు దగ్గరై.. ఫొటోలు బహిర్గతం చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఓ మైనర్ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో గత నెలలో ఆజాద్, అతడి సోదరుడిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో నాలుగు రోజులు కస్టడీకి తీసుకొని విచారించారు. మోసపోయిన వారిలో ఎక్కువ మంది మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. యువతుల నుంచి కాజేసిన సొమ్మును తల్లి, మేనమామ ఖాతాల్లో జమచేసినట్లు విచారణలో తేలింది. దీంతో తాజాగా వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

# బెంగాల్లో నేను ఓడిపోలేదు రాజీనామా చేయను

మంగళవారంనాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..ఇసి, బిజెపిలపై ఘాటు విమర్శలు చేశారు. బిజెపి కనుసన్నల్లో ఇసి పనిచేసిందన్నారు.అమిత్ షా, ప్రధాని మోడీలు కలసి చేశారని మండిపట్టారు. 'ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీ చేశారు' అని మమత ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు పోలింగ్ ముగిసిన తర్వాత కూడా 80 నుంచి 90 శాతం కంటే ఎక్కువ బ్యాటరీని కలిగి ఉండటం ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్‌కు రెండ్రోజుల ముందే అధికారులు తమ పార్టీపై దాడులు, కార్యకర్తల అరెస్టులు చేశారని అన్నారు. భవనీపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని అన్నారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. ఈ మొత్తం ఉదంతంలో 'ఇండి' కూటమి తన వైపే ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తనతో మాట్లాడారని, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, హేమంత్ సోరెన్ తదితరులు ఫోను చేసి సపోర్ట్‌గా నిలిచారని చెప్పారు. 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు.

# శాసనసభా పక్ష నేతగా విజయ్ ఎన్నిక

ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూడా చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటుకు కొన్ని సీట్లు తక్కువగా ఉన్న అంశాన్ని నేతలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ.. రాజకీయపరంగా ఆత్మగౌరవం విషయంలో తమ పార్టీ రాజీపడబోదన్నారు. పొత్తు విషయంలోనూ తమ పార్టీ స్పష్టమైన వైఖరితో ఉందని ఆ పార్టీ నేతలు తెలిపారు. అధికారం చేపట్టేందుకు అవసరమైన మద్దతు కోసం తమ పార్టీ ఎవరినీ అడుక్కోబోదని తెలిపారు. ఇక, మెజారిటీ నిరూపించుకునేందుకు టీవీకే నేతలు గవర్నర్‌ను కలిసి 15 రోజుల సమయం కోరారు. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో టీవీకే 108 సీట్లు సాధించి, అతిపెద్ద పార్టీగా మారింది. అధికారం చేపట్టాలంటే మరో 10 సీట్లు అవసరం. టీవీకేకు 35 శాతం ఓట్లు పోలయ్యాయి. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు కోసం టీవీకే ప్రయత్నిస్తోందని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు కాంగ్రెస్‌తో రాయబారం నడుస్తోందని తెలుస్తోంది. విజయ్ తండ్రి చంద్రశేఖర్ కూడా కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారు. విజయ్ పార్టీ టీవీకే అధికారం చేపట్టాలంటే పొత్తు పెట్టుకోక తప్పని పరిస్థితి. విజయ్ ఎవరితో పొత్తువైపు మొగ్గు చూపుతారో తెలియాలి.

# కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై బిజెపి స్పష్టత

### రవీంద్రుని జయంతి రోజు ప్రమాణస్వీకారం

### సిఎం అభ్యర్థిని ఎంపికచేయనున్న అధిష్టానం

కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌లో మే 9న భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య వెల్లడించారు. నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆ రోజున నూతన సీఎం ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. ఠాగూర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఒక కొత్త ఆరంభానికి నాంది పలకడానికి ఈ తేదీని నిర్ణయించామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన పనులు చేస్తున్నామన్నారు. కాగా బెంగాల్ ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. బెంగాల్ ఎన్నికల ఫలితాల అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఈసీ ఉన్నతాధికారులు.. ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్‌కు అందజేయనున్నారు. బుధవారం ఈ అధికారిక పత్రాలను సీఈసీ.. గవర్నర్ ఆర్.ఎన్.రవికి ఇస్తారు. అనంతరం ఆయన రాజీనామా సమర్పించాల్సిందిగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఆహ్వానిస్తారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసేవరకు మమత తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. ఇదిలావుంటే బెంగాల్‌లోని అసన్‌సోల్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా మూసిఉన్న దుర్గాదేవి ఆలయం సోమవారం తిరిగి తెరుచుకుంది. వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలు, పరిపాలనాపరమైన ఆంక్షల వల్ల ఈ ఆలయం చాలాకాలంగా మూసేసి ఉంది. దుర్గా పూజ, లక్ష్మీ పూజ వంటి వేడుకల కోసం మాత్రమే దీనిని తెరిచేవారు. తాను గెలిస్తే ఆలయాన్ని తెరిపిస్తానని అసన్‌సోల్ ఉత్తర్ స్థానం నుంచి పోటీ చేసిన భాజపా ఎమ్మెల్యే కృష్ణేందు ముఖర్జీ ప్రజలకు వాగ్దానం చేశారు. చెప్పినట్లుగానే సోమవారం గెలిచిన వెంటనే ఆయన ఆలయాన్ని సందర్శించి పునఃప్రారంభించారు.

# కాళేశ్వరంపై సిబిఐ విచారణ ఎందుకు చేయరు

గతంలో బీఆర్ఎస్ అవినీతిపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ పలుమార్లు ఆరోపణలు చేశారని.. అలాగే సీబీఐ విచారణను కోరారని గుర్తు చేశారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టి 8 నెలల క్రితం ఈ కేసును సీబీఐకు బదిలీ చేశామని పేర్కొన్నారు. బండి సంజయ్.. చేతిలోని తుపాకీ కాల్చకుండా కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే లాభం ఏమిటి? అంటూ టీపీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నించారు. బండి సంజయ్ లోపాయికారీ ఒప్పందంలో ఉండి ఈ దర్యాప్తునకు అడ్డుపడు తున్నారని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు లేకుండానే బీజేపీకి ఓట్లు పడ్డాయా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఎంపీ సీట్లకి కృతజ్ఞతగా 8 నెలలుగా జరగాల్సిన సీబీఐ దర్యాప్తును అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ కేసు విచారణ ఆలస్యం ఎందుకు అవుతుందో కేంద్ర మంత్రులు సమాధానం చెప్పాలని టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. ల్గ÷తుల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ గతంలో అన్న మాటలు ప్రజలు మర్చిపోలేదన్నారు. రైతులు, పేద ప్రజలకు లాభం చేసిన ప్రభుత్వం తమదే అని చెప్పారు. ధాన్యం కొనుగోలు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. పంటల దిగుబడులు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా రైతులకి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలతో కాంగ్రెస్ ముందుకు పోతుందన్నారు. బెంగాల్‌లో బీజేపీకి అనుకూల పరిస్థితులు లేవన్నారు. అక్కడ బీజేపీ గెలిచిందంటే.. అది ఓట్ల చోరీ వల్ల మాత్రమే అని టీపీసీసీ చీఫ్ కుండబద్దలు కొట్టారు. బెంగాల్‌లో ఓటు చోరీ జరిగిందని ఆరోపించారు. తెలంగాణలో కూడా అదే పరిస్థితి జరగొచ్చు అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కు కాపాడుకోవాలంటూ తెలంగాణ పౌరులకు ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. అయినా తెలంగాణలో అలాంటి ఆటలు సాగవు అని పేర్కొన్నారు. సర్ పేరిట ఓట్లు దొంగలించడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు.

# తెలుగు రాష్ట్రాలకు వర్ష హెచ్చరిక

ఈ పరిస్థితుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని అంచనా వేశారు. అదేవిధంగా తిరుపతి, చిత్తూరు, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. పిడుగుపాటు ప్రమాదం ఉన్నందున ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద ఆశ్రయం తీసుకోకూడదని ప్రజలకు సూచించారు. క సోమవారం ప్రకాశం, పార్వతీపురం మన్యం, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచి, పిడుగులు పడినట్లు సమాచారం. రాష్ట్రంలో ఒకవైపు వర్షాలు కురుస్తుండగా, మరోవైపు వేడి కూడా కొనసాగుతోంది. కృష్ణా జిల్లాలో 43.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదవగా, అనేక మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలో కూడా అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం పలు జిల్లాల్లో వడగళ్ల వాన కురిసి నష్టం కలిగించింది. రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇటీవల ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల జిల్లాల్లో గణనీయమైన వర్షపాతం నమోదైంది. కొన్నిచోట్ల 2 నుంచి 7 సెంటీమీటర్ల వరకు వర్షం పడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ అకాల వర్షాల కారణంగా పంటలకు నష్టం కలగొచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిస్థితిని గమనిస్తూ రైతులకు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తోంది.

# ఇచ్చిన హామీలకు.. పాలనకు పొంతన లేదు

సిద్దిపేట : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఆయన చేస్తున్న పనులకు ఎక్కడా పొంతన లేదని ప్రజలు చెప్పుకొనే పరిస్థితి వచ్చిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ఎన్ని శాపనార్థాలు పెట్టినా వేస్ట్ అని.. మళ్ళీ ఎన్నికలు వచ్చినప్పుడు ఓడిస్తే తప్ప మనకు మన:శాంతి లేదని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీజేపీ నేతల సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. రిటైర్ ఉద్యోగులకు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద నగదు చెల్లించక పోవడంతో కోర్టు జోక్యం చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేసే పరిస్థితి వచ్చిందంటే.. ప్రభుత్వాన్ని ఎట్లా నడుపుతున్నారో వాళ్లకే తెలియాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న పనులు చేసుకునే కాంట్రాక్టర్లకు బిల్లులు అందక గతంలోనే కాదు.. నేడు కూడా వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఎంపీ ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లకే కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత ఛీ కొట్టించుకునే పరిస్థితులు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం బాగుపడాలంటే ఏకైక మార్గం బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అరాచకం, దుర్మార్గాలు జరిగినా.. ఇది నా జాగీరు అని అహంకారంగా పాలించిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీని ప్రజలు ఓడించారని ఎంపీ ఈటల తెలిపారు. తమిళనాడులో స్టాలిన్ మీద ఒక సామాన్యుడు గెలిచాడంటే డీఎంకే ప్రభుత్వంపై ప్రజలకు ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టమైందన్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలని తాను కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. కుటుంబ రాజకీయాలు నడిపేవారు.. ఈ రాష్ట్రానికి తామే ఓనర్లమనే పద్ధతిలో అన్ని వాళ్లే చేసుకునే వారికి, లక్షల కోట్ల రూపాయలు స్కాంలు చేసి డబ్బులు సంపాదించి.. వాటితో ఎన్నికల్లో గెలవాలని కుట్ర చేసే వారికి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అత్యుత్తమ ఉదాహరణ అని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు.. చిన్న విషయం కాదన్నారు.దీనిపై లోతుగా ఆలోచించాల్సిన విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు ఎంత అప్రమత్తంగా, ఎంత షార్ప్‌గా ఉన్నారో ఈ ఫలితాలను బట్టి మనకు అర్థమవుతుందని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు.

# ప్రధాని పర్యటనలో భారీ భద్రత

ఎక్కడా పొరపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ఆయన సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధానమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదేరోజు బహిరంగసభలో పాల్గొననున్నారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసుశాఖకు ప్రధాన కార్యదర్శి సూచించారు. బేగంపేట్ విమానాశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఫైర్ సర్వీసెస్ శాఖ అధికారులను, అవసరమైన వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ పర్యటించే మార్గాలలో రోడ్లను పరిశీలించాలని ఏ వైన మరమ్మత్తులు ఉంటే యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని పోలీసు, ఉఊఓఅ, రోడ్లూ భవణాల శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రధానమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ , నవీన్ మిట్టల్, దానకిషోర్, వాణిప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, ఇంటిలిజెన్స్ అడిషనల్ డిజి అనిల్ కుమార్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్లు విసి సజ్జనార్, రమేష్ , సుమతి,÷ర్ సర్వీసెస్ డీజీ, విక్రమ్ సింగ్ మన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

పంటను కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల వర్షాల కారణంగా పంట దెబ్బతింటుందని, దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. కేటీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం జనగామ మండలంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ సందర్శించారు. అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 15 నుంచి 20 రోజులుగా ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కేటీఆర్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అలాగే మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.22,000 కోట్ల అప్పులు తీసుకువచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాల కారణంగా అక్కడి నుంచి నిధులు రాకపోవడంతో, మార్క్‌ఫెడ్ నిధులను వాడుకుంటున్నారని చెప్పారు. తాను చెప్పిన లెక్కలు తప్పైతే ప్రభుత్వం రుజువు చేయాలని సవాల్ విసిరారు. రైతులను ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, రేపటి వరకు గడువు ఇస్తున్నామని తెలిపారు. లేకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

# రాజధాని ప్రాంతంలో మౌళిక వసతులు

చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారం కోసం సీఆర్డీఏ కార్యాలయంలో త్రీమెన్ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అనివార్య కారణాలు, అసెంబ్లీ సమావేశాల కారణంగా త్రీమెన్ కమిటీ సమావేశం కొంత ఆలస్యం అయ్యిందని తెలిపారు. కొత్తగా సీఆర్‌డీఏ కమిషనర్‌గా విజయరామరాజు బాధ్యతలు స్వీకరించారన్నారు. నేడు జరిగిన సమావేశంలో రాజధాని గ్రామాల సమస్యలపై కీలకంగా చర్చించామని, ఎన్ఎస్పీ ప్రభావిత బాధితుల ఇళ్ల సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. ఎఫ్ఎస్ఐ అంశాలపై కూడా సుదీర్ఘంగా మాట్లాడామన్నారు. మరో 2-3 వారాల్లో రెగ్యులర్ మీటింగ్‌లు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అంశాల వారీగా సమీక్ష చేయడంతో పాటు, పరిష్కారాలపై ఎప్పటికప్పుడు అప్డేట్లు ఇవ్వాలని అధికారులకు సూచించామని పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. రాజధాని అమరావతిలో రైతుల సమస్యలపై త్రీమెన్ కమిటీ, అధికారులు కలిసి చర్చించామని మంత్రి నారాయణ తెలిపారు. రోడ్లు, డ్రైన్‌లు, వాటర్, పార్కులు వంటి వాటిపై చర్చించామన్నారు. సీఆర్‌డీఏ కమిషనర్ కొత్తగా వచ్చారని.. ఆయన కూడా అన్ని గ్రామాలకు వెళ్లి, వారితో మాట్లాడితే క్లారిటీ వస్తుందని భావిస్తున్నారని తెలిపారు. గ్రామ గ్రామానికీ వెళ్తే ప్రజలు ఎక్కువగా వస్తారని.. సమస్యలు చెబుతారన్నారు. అప్పుడు అధికార యంత్రాంగానికి కూడా సమస్యలపై క్లారిటీ వస్తుందని మంత్రి నారాయణ వెల్లడించారు. పాలసీ ప్రకారమే అన్నీ అమలవుతాయని, ఎవరికీ మినహాయింపులు ఉండవని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఆర్ ఫైవ్ జోన్‌ను వెనక్కి తీసుకున్నామని అన్నారు. అన్ని జోన్లలోనూ పనులు వేగంగా జరుగుతున్నాయని.. ఎక్కడా ఆలస్యం అనే మాటే లేదని మంత్రి తెలిపారు. హైటెన్షన్ వైర్ల రీ రూటింగ్.. శాఖమూరు పార్కు వరకు జరుగుతోందన్నారు. అక్కడి నుంచి ఎక్స్‌టెన్షన్.. రెండో దశ ల్యాండ్ పూలింగ్ తరువాత జరుగుతుందని చెప్పారు. రైతులకు కౌలు పెంపు విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై చర్చించామన్నారు. రెండో దశలో కూడా ల్యాండ్ పూలింగ్‌కు రైతులు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ నెలాఖరుకు 60? భూ సమీకరణ పూర్తయ్యే అవకాశం ఉందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# బెంగాల్, అసోంలలో ఓట్ చోరీ

ఇది కేవలం ఓ పార్టీ ఓటమి కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేసే ప్రమాదకర పరిణామం అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సంకుచిత రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి.. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణపై అన్ని పార్టీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా రాహుల్ పిలుపునిచ్చారు. 'ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. దేశ అస్తిత్వానికి సంబంధించిన సమస్య' అని ఆయన పేర్కొన్నారు. విపక్ష పార్టీల మధ్య అనైక్యత పెరుగుతున్న నేపథ్యంలో.. అది బీజేపీకి వరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలు దేశ ప్రజాస్వామ్య వినాశనానికి సంకేతాలుగా పరిగణించాల్సిన అవసరం ఉందని రాహుల్ హెచ్చరించారు. విపక్షాలు పరస్పర విభేదాలను తగ్గించి, ప్రజాస్వామ్య రక్షణ కోసం ఒకే వేదికపైకి రావాలని సూచించారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా రాజకీయ పార్టీలన్నీ బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

# బిఆర్ఎస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

గత ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరి అన్నారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరివేసిన రైతులకు మద్దతు ధర కల్పిస్తూ.. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. 'రైతులకు ఎకరానికి రూ.12వేల ఆర్థిక సాయంతోపాటు వ్యవసాయ పరికరాలు ఇస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌కు రూ.1200 కోట్లు చెల్లిస్తున్నాం. రైతును రాజు చేసే వరకు విశ్రమించబోము' అని పొంగులేటి అన్నారు.

# రైల్వేజోన్ ఏర్పాటుపై సిఎం చంద్రబాబు హర్షం

నూతనంగా ఏర్పాటైన విశాఖపట్నం డివిజన్, రాయగడ డివిజన్‌ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఏపీ సీఎం ఆకాంక్షించారు. రాష్ట్రాభివృద్ధికి.. ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి ఈ రైల్వే జోన్ ఏర్పాటు దోహద పడుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఇదిలావుంటే విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు రాష్ట్ర ప్రగతిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు అన్నారు. కొత్త రైల్వేజోన్‌తో రైళ్ల సంఖ్య పెరిగి కనెక్టివిటీ పెరుగుతుందన్నారు. రాయగడ డివిజన్ పరిధిలోకి కేకేలైన్ వెళ్లినా ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు

# ఐపిఎస్ విశాల్ గున్నికి హైకోర్టు షాక్

క్యాట్ ఉత్తర్వులను రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. డీజీపీ, సీఎస్ తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సస్పెన్షన్ కాల పరిమితి ముగియక ముందే ఉత్తర్వులను క్యాట్ రద్దు చేసిందని, దాని కారణంగా విచారణ ముందుకు వెళ్లలేదని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. ఇక, విశాల్ గున్ని తరుఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపించారు. ఇరు వర్గల వాదనలు విన్న అనంతరం క్యాట్ ఉత్తర్వులపై స్టే విధిస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. కేసుపై లోతైన విచారణ అవసరమని అభిప్రాయపడింది. తదుపరి విచారణను ఆగస్టు 29వ తేదీకి వాయిదా వేసింది.

# రైతులను గోసపెడుతున్న కాంగ్రెస్

### మక్కల కొనుగోలు కేంద్రాలు ఏవీ

### 6న రైతు సదస్సు విజయవంతం చేయాలన్న చల్లా

వరంగల్,మే5 : రైతులను కష్టాలపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి రైతుల గోస తగులుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. రుణమాఫీ కాలేదని, రైతు భరోసాను ఎగ్గొట్టారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా మక్కలు కొనడం లేదని, దీంతో రైతులు మండుటెండలో పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ఈ నెల 6న హనుమకొండలో నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని చల్లా ధర్మారెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం గూడెప్పాడు మార్కెట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి వారి సమస్యలు, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న మోసాలను అడిగి తెలుసుకున్నారు. 20 రోజులు గడిచిన కాంటాలు పెట్టడంలేదని, ఏది చేయాలన్న డబ్బులు అడుగుతున్నారని, కనీసం తాగడానికి నీళ్లు కూడా మార్కెట్‌లో లేవని, అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే కాంటాలు పెడుతున్నారని రైతులు మాజీ ఎమ్మెల్యేకి తెలుపుతూ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో రైతులతో కలిసి గుడెప్పాడ్ క్రాస్ వద్ద మక్కలు కొనుగోలు చేయాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ..మక్కలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. గన్నీ బ్యాగులు ఇవ్వకుండా, కాంటాలైన బస్తాలు తరలించకుండా కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యకం చేశారు. మక్కల కొనుగోలులో అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నట్టు తెలిపారు.

# చురుకుగా రబీ ధాన్యం సేకరణ

**మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలి**

**ధాన్యం తరలించేందుకు లారీలు పెంచాలి**

**నల్లగొండలో ఆకస్మికి పర్యటన చేసిన స్టీఫెన్ రవీంద్ర**



నల్లగొండ,మే5 : రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు. అన్‌లోడింగ్ తోపాటు, వెహికల్ రోటేషన్, కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించడం,లారీలు, హమాలీలను పెంచాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, పెద్దకాపర్తి లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెదకాపర్తి కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన దాన్యం వివరాలు, హమాలీలు, ,ట్రక్ షీట్లు, మిల్లుల ట్యాగింగ్ చేసిన వాహనాలు,టార్పాలిన్లు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, కేంద్రం నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాగా ఇప్పటివరకు ఈ కేంద్రానికి 25 వేల క్వింటాళ్ల దాన్యం వచ్చిందని, ఇందులో 7000 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరిగిందని, ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేశామని, ఇంకా కొనుగోలు కేంద్రంలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. పెదకాపర్తి కేంద్రం పెద్ద సెంటర్ అయినందున అన్ని పెద్ద సెంటర్లలో 10 నుండి 20 వరకు ఎక్స్ట్రా లారీలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సివిల్ సప్లై కమిషనర్ కు వివరించారు. హమాలీల కొరత లేకుండా మిల్లర్లకు ముందే సమాచారం ఇవ్వడం జరిగిందని, ఒక్కొక్క కొనుగోలు కేంద్రంలో 30 వరకు హమాలీలు ఉన్నారని, అదేవిధంగా మిల్లుల్లో సైతం 30 నుండి 35 వరకు హమాలీలను ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషన్ మాట్లాడుతూ ట్యాబ్ ఎంట్రీ నూటికి నూరు శాతం కావాలని, కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు డ్రయ్యర్లు, శుభ్రపరిచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగుల వివరాలను, టార్పాలిన్లను అడిగారు. అవసరమైతే ఎక్స్ట్రా టార్పాలిన్లు కొనుగోలు కేంద్రాలలో పెట్టాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కమిషనర్ వట్టిమర్తిలో ఉన్న సిద్దార్థ రైస్ ఇండస్ట్రీస్ ను సందర్శించి అక్కడ ఎంత మంది హమాలీలు ఉన్నారని అడగగా 35 మంది ఉన్నారని తెలిపారు. అన్ లోడింగ్, వెహికల్ రోటేషన్ పెంచాలని చెప్పారు.అంతేకాక సిస్టం ద్వారా ధాన్యం వివరాల అఎ÷-లోడింగ్ ,ట్యాబ్ ఎంట్రీ వివరాలను ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేస్తున్నామని చెప్పారు. ట్యాబ్ ఎంట్రీ పెండింగ్ ఉన్న కొనుగోలు కేంద్రాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, మిల్లులలో స్థలం లేకుంటే ఇంటర్మీడియట్ గోడౌన్లకు తరలించాలని, ధాన్యం తరలింపు తో పాటు, మరిన్ని వాహనాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ శాఖ డిప్యూటీ కమిషనర్ వాణిని సివిల్ సప్లైస్ కమిషనర్ ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ రోహిత్ సింగ్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ జీఎం నాగేశ్వర రావు, ట్రాన్స్పోర్ట్ డిప్యూటీ కమిషనర్ వాణి, పౌరసరఫరాల శాఖ వెంకటేశం జి ఎం. రాంపతి నాయక్, డిసీఓ పత్యా నాయక్, మార్కెటింగ్ శాఖ ఎడి ఛాయాదేవి, చిట్యాల తహసిల్దార్ విజయ్, తదితరులు ఉన్నారు.

# బిసిలను పట్టించుకోని కేంద్రం

## 9న ఆమరణ దీక్ష చేపడతానన్న విహెచ్

హైదరాబాద్,మే5 : బీసీ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో మాట్లాడిన ఆయన, ఈ నెల 9వ తేదీన ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ప్రకటించారు. 'బీసీ హక్కుల కోసం ప్రాణం పోయినా సరే పోరాడుతా' అని స్పష్టం చేసిన వీహెచ్.. బీజేపీ బీసీ ఎంపీలు ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 'అంబేద్కర్‌ను మా దేవుడిగా భావిస్తాం. అలాంటి మహనీయుడిని కూడా అవమానించే విధంగా పరిస్థితులు ఉన్నాయి' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా జరుగుతున్న జనగణనలో బీసీల ప్రస్తావనే లేకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'బీసీలు ఓట్లు వేయడం లేదా? వారి సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని వీహెచ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు లేఖలు రాసినా స్పందన రాలేదని వీహెచ్ ఆరోపించారు. ÷ఖసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ధర్నాలు జరిగినప్పటికీ బీసీ సమస్యలపై కేంద్రం వైఖరిలో మార్పు రాలేదని వీహెచ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే తాను నిరాహార దీక్షకు దిగుతున్నట్లు ప్రకటించారు. వీహెచ్ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో బీసీ అంశం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

# ఏరోస్పేస్ దిగ్గజాలకు తెలంగాణ వ్యూహాత్మక భాగస్వామి

**డ్రోన్ టెక్నాలజీ, శాటిలైట్ కమ్యూనికేషన్స్ లోనూ గ్లోబల్ లీడర్**

**ఎకోసిస్టమ్, ఇన్నోవేషన్, ఆర్‌అండ్ డీ, ఇండస్ట్రీ రెడీ వర్క్ ఫోర్స్ పైదృష్టి**

**'ఐటీపీ ఏరో - ఇండియా' ప్లాంట్ కు మంత్రి శ్రీధర్ బాబు భూమిపూజ**




హైదరాబాద్,మే5 : అంతర్జాతీయ ఏరోస్పేస్ దిగ్గజాలకు తెలంగాణను ఒక వ్యూహాత్మక భాగస్వామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రాన్ని కేవలం విడిభాగాల తయారీకే పరిమితం చేయకుండా.... గ్లోబల్ ఏరోస్పేస్ ఆర్ అండ్ డీ హబ్‌గా మార్చేందుకు అవసరమైన 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ హార్డ్ వేర్ పార్క్‌లో రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న 'ఐటీపీ ఏరో - ఇండియా' మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ కు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ఆనతికాలంలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌లలో ఒకటిగా తెలంగాణను నిలిపామన్నారు. వరుసగా అయిదేళ్ల కేంద్రం నుంచి 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం రాష్ట్రంలోని పటిష్ఠమైన ఎకో సిస్టమ్‌కు నిదర్శనమన్నారు. బోయింగ్, జీఈ ఏవియేషన్, సాఫ్రాన్, లాక్హీడ్ మార్టిన్, టాటా వంటి గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలు ఇప్పటికే మన దగ్గర కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యన్నారు. తాజాగా... ఈ జాబితాలో స్పెయిన్ దిగ్గజ సంస్థ 'ఐటీపీ ఏరో' కూడా చేరడంతో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమవుతుందన్నారు. సంప్రదాయ తయారీ రంగంతో పాటు డ్రోన్ టెక్నాలజీ, శాటిలైట్ కమ్యూనికేషన్స్ లాంటి నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీస్ లోనూ రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా నిలిపేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అందుకు అవసరమైన... మౌలిక సదుపాయాల కల్పన, ఎకోసిస్టమ్ అభివృద్ధి, ఇన్నోవేషన్, ఆర్ అండ్ డీ, ఇండస్ట్రీ రెడీ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. విమాన ఇంజిన్ల తయారీలో వినియోగించే అత్యంత కీలకమైన విడిభాగాలు ఈ 'ఐటీపీ ఏరో ? ఇండియా' నూతన మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ లో ఉత్పత్తి అవుతాయన్నారు. వచ్చే ఏడాది నాటికి ఇక్కడ కార్యకలాపాలు పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయన్నారు. ప్రిసిషన్ ఇంజనీరింగ్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, క్వాలిటీ కంట్రోల్ తదితర విభాగాల్లో ప్రాథమికంగా 350 మంది నిపుణులకు ఉపాధి లభిస్తుందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 600కు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీపీ గ్రూప్ సీఈవో ఈవా అజూలే, ఎండీ కార్లోస్ అల్జోలా, వైస్ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) వాలెంటిన్ గొరోనో, ఐటీపీ ఇండియా ఎండీ సందీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మమత వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

**రాజీనామా చేయనంటే డిస్మిస్ చేస్తారు**

**అసోం సిఎం హిమంత్ బిశ్వశర్మ ఘాటు వ్యాఖ్యలు**

గువాహటి,మే5 : పశ్చిమబెంగాల్‌లో తాను ఓడిపోలేదని, రాజీనామా చేసేది లేదని టీఎంసీ అధినేత్రి మమతాబెనర్జీ చేసిన వ్యాఖ్యలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఘాటుగా స్పందించారు. 'అప్పుడు ఒకటే మార్గం ఉంటుంది. డిస్మిస్ చేయడమే' అని ఒక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. చాలా కాలంగా ఆమెను ప్రజలు భరిస్తూ వచ్చారని వ్యాఖ్యానించారు. ఇంకా భరించరని, రాజ్యాంగ విరుద్ధ ప్రకటనలు చేయడం ద్వారా ఆమె నైజం ఏమిటో మరోమారు తెలిసిందన్నారు. ఓటమి తరవాత హుందాగా ఒప్పుకుని రాజీనామా చేయాల్సింది పోయి, ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చట్టం ఒప్పుకోదన్నారు. మూడుసార్లు అధికారంలో కొనసాగిన మమతా బెనర్జీ తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మంగళవారంనాడు మీడియా సమావేశంలో ఘాటుగా స్పందించారు. బెంగాల్‌లో తాను బీజేపీతో పోరాడలేదని, ఆ పార్టీ కోసం పనిచేసిన ఎన్నికల సంఘంతో పోరాడానని, తన జీవితంలో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని అన్నారు. ప్రధాని ఎన్నికల కమిషనర్‌ను 'విలన్'గా పేర్కొన్నారు. ఎన్నికల సంఘంతో కలిసి బీజేపీ గేమ్ ఆడిందని, 100 స్థానాలను బీజేపీ లూటీ చేసిందని అన్నారు. ఇది తమ ఓటమి కాదని, అందువల్ల రాజీనామా చేయనని, రాజ్‌భవన్‌కు వెళ్లనని చెప్పారు. మతాబెనర్జీ రాజీనామాకు నిరాకరిస్తే రాష్ట్రపతి పాలన అమల్లోకి తెచ్చే అవకాశాలుండవచ్చని వినిపిస్తుండగా, ఆ అవసరం లేదని ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ఎన్నికల గడువు ముగియడానికి ముందే గెలిచిన పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా గవర్నర్ ఆహ్వానిస్తే చాలని పేర్కొన్నాయి. పశ్చిమబెంగాల్ ప్రస్తుత అసెంబ్లీ గడువు మే 7తో ముగియనుంది. అయితే రెండ్రోజుల తర్వాత మే 9న కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి బీజేపీ సన్నాహాలు చేస్తోంది.

# 9 రాష్ట్రాల్లో ఆపరేషన్ ఆక్టోపస్

## సైబర్ క్రైమ్ పోలీసుల దాడులు

## 56 మంది నిందితుల అరెస్ట్

హైదరాబాద్ : హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆపరేషన్ ఆక్టోపస్ 2.0తో పేరుతో భారీ ఎత్తున దాడులు నిర్వహించారు. తొమ్మిది రాష్ట్రాల్లో ఈ ఆపరేషన్లు నిర్వహించి.. 56 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బ్యాంక్ సిబ్బందితోపాటు పట్టుబడ్డ నిందితులకు 101 కేసులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. అలాగే అరెస్ట్ అయిన వారిలో 32 మంది బ్యాంక్ మేనేజర్లు, కేవైసీ అప్రూవర్లు, రిలేషన్‌షిప్ మేనేజర్లతోపాటు ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు. అదే విధంగా15 మంది మ్యూల్ అకౌంట్ హోల్డర్లతో పాటు, 9 మంది అకౌంట్ ఆపరేటర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరందరికీ 101 కేసులతో సంబంధం ఉందని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బాధితులకు రూ. 69.99 లక్షలు రీఫండ్ చేశారు. ఈ 101 కేసుల్లో బాధితుల నుంచి రూ. 9.13 కోట్ల నగదును నిందితులు కొట్టేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇక అరెస్టయిన వారిలో 17 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కు సంబంధించిన వారని పోలీసులు వివరించారు. ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 30 మంది, డిజిటల్ అరెస్ట్ కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇలా అరెస్టయిన వారిలో తెలంగాణ నుండి అత్యధికంగా 17 మంది ఉన్నారని తెలిపారు. మహారాష్ట్ర నుంచి 14, ఢిల్లీ నుంచి 9, కర్ణాటక నుంచి నలుగురు, ఏపీ నుంచి ఇద్దరు అరెస్టయ్యారని పేర్కొన్నారు. నిందితుల నుంచి 34 మొబైల్ ఫోన్లు, 8 చెక్ బుక్కులతోపాటు 11 షెల్ కంపెనీ స్టాంపులు, ట్యాబ్ సీజ్ చేశామని వివరించారు. సైబర్ పెట్రోలింగ్ ద్వారా అక్రమ బెట్టింగ్, నకిలీ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్న 184 సోషల్ మీడియా ప్లా÷ళ్లు తొలగించినట్లు పోలీసులు చెప్పారు. సి-మిత్ర ద్వారా1250 కాల్స్ చేసి బాధితులకు అవగాహన కల్పించడంతో పాటు 194 జీరో ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. గేమింగ్ ఫ్రాడ్ కేసులో బాధితురాలిని మోసం చేసి రూ. 74.99 లక్షలు మోసం చేసిన కేసులో కోల్‌కతాకు చెందిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ కీ అకౌంట్ మేనేజర్ మొహమ్మద్ రియాజుద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ మనీష్ ప్రసాద్ విశ్వకర్మను అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు వెల్లడించారు.

# మహిళ మెడలో గొలుసు చోరీ ఘటన

**ధైర్యంగా అడ్డుకున్న ఆటో డ్రైవర్**

**ఆటో డ్రైవర్‌ను అభినందించి సన్మానించిన సిపి**

హైదరాబాద్,మే5 : ఓ సామాన్య ఆటో డ్రైవర్ అసామాన్య ధైర్య సాహసాలు ప్రదర్శించాడు. మహిళ మెడలో గొలుసు లాక్కుని పారిపోతున్న రౌడీ షీటర్‌ను తన ఆటో సాయంతో అడ్డుకున్నాడు. కర్రతో దాడి చేస్తున్నా బెదరకుండా అతడిని పట్టుకున్నాడు. రౌడీ షీటర్ అరెస్ట్ అవ్వడానికి ఎంతో కృషి చేశాడు. ఆటో డ్రైవర్ ధైర్యసాహసాలకు సరైన గుర్తింపు దక్కింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆటో డ్రైవర్‌ను సన్మానించారు. ఆ పూర్తి వివరాల్లోకి వెళితే.. మార్చి 4వ తేదీ తెల్లవారుజామున బేగం బజార్ జీన్సీ చౌరాహా ప్రాంతంలో మంజు ఓమ్లుతా తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. హిందీ మర్వాడీ విద్యాలయ స్కూల్ వద్ద ఊహించని పరిణామం చోటుచేసుకుంది. డబీర్‌పురకు చెందిన రౌడీ షీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో అతడి స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయింది. బాధితురాలు గట్టిగా కేకలు వేసింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ సైడ్ వ్యూ మిర్రర్ ద్వారా ఆ దృశ్యాన్ని చూశాడు. వెంటనే ఆటోను రివర్స్ చేశాడు. రౌడీ షీటర్ స్కూటీని పైకి లేపి అక్కడినుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. జాహెర్ ఆటోతో స్కూటీని ఢీకొట్టాడు. దీంతో మహ్మద్ సోహేల్ కిందపడిపోయాడు. జాహెర్ వెంటనే కిందకు దిగి సోహేల్‌ను పట్టుకున్నాడు. తర్వాత అటు వైపు వెళుతున్న వారు కూడా జాహెర్‌కు సాయం చేశారు. రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించారు. అనంతరం జాహెర్ అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఎలాంటి ప్రతిఫలం ఆలోచించకుండా.. తన ప్రాణాలకు తెగించి రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించిన జాహెర్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మంగళవారం బంజారాహిల్స్, టీజీఐసీసీసీలోని తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా సన్మానించారు. ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో గోల్కొండ జోన్ డీసీపీ జీ చంద్ర మోహన్, గోషామహల్ ఎస్‌హెచ్‌ఓ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ గోదామ్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్,మే5 : బాలాపూర్ పరిధిలోని కొత్తపేట గాలిబ్ కాలనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్లాస్టిక్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికుల్గు ÷ర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

**పోలవరంకు జాతీయ హోదా ఇచ్చి, తెలంగాణను విస్మరిస్తే ఎలా**

**ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వక పోవడం వివక్షే**

**ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం సరికాదు**

**నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమే**

**పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా**

**ప్రధాని మోడీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి**

రాజన్నసిరిసిల్ల,మే5 : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంబిరావుపేట గ్రామంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనమన్నారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. కేవలం కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటించి మిగిలిన వాటి విషయంలో కేంద్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులను నిర్మించి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ఎ÷-లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు. మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించిన ప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర (ఓ÷ాఖ) కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు పక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# కరీంగనర్ బంగారం షాపు చోరీ

**ధర్మపురి లాడ్జిలో దొంగల బస**

**సిసి ఫుటేజ్ ఆధారంగా దొంగలను గుర్తించే పని**

కరీంనగర్,మే5 : కరీంనగర్‌లోని బంగారం షాపు చోరీ కేసులో దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని ఒక లాడ్జిలో దుండగుల ముఠా బస చేసినట్లు గుర్తించారు. గోదావరి తీరం పక్కనే ఉన్న ప్రైవేట్ లాడ్జిలో వారు రెండు రోజులు ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. మే 3వ తేదీ ఉదయం లాడ్జిని ఖాళీ చేసిన ఈ ముఠా.. బైక్‌లపై మట్టి రోడ్డు ద్వారా కరీంనగర్ చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ధర్మపురి నుంచి బయలుదేరిన ఈ ముఠా.. ధర్మారం, పెగడపల్లి, రామడుగు మండలాల మీదుగా కరీంనగర్‌కు చేరుకుందని సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ సందర్భంగా ధర్మపురిలో వీరు బస చేసిన లాడ్జిని పోలీసులు తనిఖీ చేశారు. అలాగే సీసీ టీవీ ఫుటేజ్‌ను పోలీసులు జల్లెడ పడుతున్నారు. అదే సమయంలో వారి ఫోన్ కాల్స్‌ను సైతం పోలీసులు పరిశీలిస్తున్నారు. పక్కాగా రెక్కీ చేసిన తర్వాతే కరీంనగర్‌లోని పీఎంజే దుకాణంలో చోరీ చేసి.. సిబ్బందిపై కాల్పులు జరిపినట్లు పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. మే 3వ తేదీన కరీంనగర్‌లోని పీఎంజీ జ్యువెలరీ షాపులో భారీగా బంగారం చోరీ జరిగింది. బైక్‌లపై సాధారణ కస్టమర్లలాగా వచ్చిన ఐదుగురు నిందితులు.. షాపులో క్షణాల్లో బీభత్సం సృష్టించారు. తుపాకులతో సిబ్బందిని బెదిరించడంతో పాటు.. వారిపై కాల్పులు జరిపారు. దీంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి.. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వారిని పట్టించిన వారికి నగదు బహుమతిగా ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

# మోత్కూరులో రైతుల రాస్తారోకో

యాదాద్రి భువనగిరి,మే5 : ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చేతికొచ్చిన పంట కండ్ల ముందే వర్షార్పణం అవుతుంటే కడుపుమండిన రైతులు రోడ్లపై కొచ్చి ఆందోళనలు చేపడుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## సంపాదకీయం

# ప్రజల ఆకాంక్షలను బిజెపి గౌరవించాలి !

దేశంలో అత్యధిక రాష్ట్రాలు ఇప్పుడు బిజెపి ఖాతాలో పడ్డాయి. మోడీ నామజపంతో పొంగిపోకుండా ప్రజలకు మార్పును చూపాలి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు పరిష్కారం దక్కాలి. విద్య,వైద్యం,ఉపాధి రంగాలకు పెద్దపీట వేయాలి. బిజెపి రావడం వల్లనే ఈ సమస్యలు పరిష్కారం అయ్యాయని ప్రజలు చర్చించాలి. అప్పుడే మార్పు సాధ్యం అవుతుంది. ఇకపోతే మిగతా రాష్ట్రాల్లో ఎలా ఉన్నా..బెంగాల్లో సరిహద్దులకు కంచె వేస్తామన్న బిజెపి హామీ నెరవేర్చాలి. ఇందుకు తక్షణం నడుం బిగించాలి. అలాగే చొరబాటుదారులను గుర్తించి నిర్దాక్షిణ్యంగా ఏరి పారేయాలి. ఎందుకంటే చొరబాటుదారులు స్థానిక ప్రజలను మించి, పెత్తనం సాగిస్తున్నారు. ఊరూరా జల్లెడ పట్టి వారిని గుర్తించాలి. రోహింగ్యాల విషయంలో ఎలాంటి క్షమాగుణం అవసరం లేదు. భారతదేశం ధర్మసత్యం కాదన్న కేంద్ర  హోం మంత్రి అమిత్ షా వెంటనే ఇందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి. బెంగాల్‌తో పాటు అసోం, ఈశాన్య రాష్ట్రాలను జల్లెడపడితే తప్ప స్థానికంగా గొడవలు సద్దుమణగవు. ఒక్కొకక్కరిని గుర్తించి, వారి ఆధార్, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు వంటివన్నీ లాగేసుకుని సరిహద్దు దాటించాలి. అలాగే సరిహద్దు కంచెపైనా నిర్ణయం తీసుకోవాలి. ఇవే సమస్యలపై బిజెపి పోరాడింది కనుక ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రథమ కర్తవ్యం ఇదే కావాలి. యావద్భారతంలో ఆసక్తి రేకెత్తించిన ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే ప్రజలు మార్పును కోరుకున్నారు. బెంగాల్లో మమతా బెనర్జీ 15 ఏళ్ల రాక్షస పాలనను ప్రజలు తమ ఓటుహక్కుతో తిరస్కరించారు.  ఇకపోతే తమిళనాటు విజయ్ గెలవడం ఓ సంచలనమే. ఆయన హామీలు గుప్పించారు. తెలుగు రాష్ట్రాల్లో లాగా బంగారం, మహిళలకు నెలనెలా పెన్షన్ లాంటి చెల్లింపులు తదితర హామీలు గుప్పించారు.  ద్రవిడ పార్టీల ఆధిక్యాన్ని సవాలు చేస్తూ.. తమిళనాట సినీ హీరో విజయ్ అరంగేట్రంలోనే అదరగొట్టడంలో హామీల బుట్ట కూడా ఉంది. సినీ ఛరిష్మాకు తోడు, హామీలు కూడా కలసి వచ్చాయి. కనుక గత పాలకుల వైఫల్యాలను ముందు పెట్టుకుని విజయ్ నడుచుకుంటేనే నిలదొక్కు కోగలరు. కేరళలో యూడీఎఫ్ మళ్లీ పీఠమెక్కడంతో.. కామ్రేడ్లకు ఇక దేశంలో ఎక్కడా స్థానం   లేకుండా పోయింది. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బెంగాల్, త్రిపుర, కేరళలో అవకాశాలు లేనట్లుగానే భావించారు. ఇది వారి స్వయంకృతమనే చెప్పలి. నేలవిడిచి సాము చేయడం కమ్యూనిస్టులకు అలవాటు. కేరళలో కూడా అదే జరిగింది. పదేళ్ల పినరయ్ విజయన్ అధికారంలో కేరళలో గణనీయమైన మార్పులు గోచరించ లేదు. అస్సాంలో కమలం ముచ్చటగా మూడోసారి జయభేరి మోగించారు. పుదుచ్చేరిలో మళ్లీ సామాన్యుడికే పీఠం దక్కింది. అస్సాం, పుదుచ్చేరి తప్పిస్తే... అంతటా ఓటర్లు మార్పునే కోరుకున్నారు. భారత ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించిన రోజిది. మన రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలు విజయం సాధించాయి.  అని ప్రధాని మోడీ ప్రకటించుకున్నారు. ఒక్కో రాష్ట్రం బిజెపి ఖాతాలో పడుతున్న వేళ ప్రజలకు మేలైన  పాలన దిశగా బిజెపి కృషి చేయాలి. లేకుంటే ఈ ఆనందం ఆవిరి కావడానికి కూడా సమయం పట్టదు. గంగోత్రి  నుంచి గంగాసాగర్ వరకు కమలం వికసించిందన్న ప్రధాని మోదీ, ప్రజల ఆకాంక్షలను కూడా పట్టించుకోవాలి. దేశంలో అనేకానేక సమస్యలు ఉన్నాయి. వాటిపై కమలనాథులు దృష్టి సారించాలి. ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ తాము పోటీ చేసిన స్థానాల్లో ఘోర పరాజయం పాలయ్యారు. ఆయా రాష్ట్రాల్లో పలువురు మంత్రులు మట్టికరిచారు.  భవానీపుర్‌లో పోటీ చేసిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ప్రత్యర్థి, ప్రతిపక్ష భాజపా నేత సువేందు అధికారి చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. ఆమెతోపాటు దాదాపు 20 మంది మంత్రులు ఓడిపోయారు. సువేందు అధికారి రెండు చోట్లా విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో మమతా బెనర్జీ తీవ్ర అసహనానికి గురయ్యారు. చివరి వరకూ వేచి ఉండాలని, విజయం తమదేనని మధ్యాహ్నం సమయంలో వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే సాయంత్రానికి తృణమూల్ పరాజయం పరిపూర్ణమైంది. రాజకీయాల్లో కక్షలు కార్పణ్యాలు తగవు. ప్రజలను ప్రజలుగా చూడలేని వారు అధికారానికి అనర్హులు. బెంగాల్లో ప్రజలకు గత పదిహేనేళ్లుగా స్వేచ్ఛ లేకుండా పోయింది. బెంగాల్ విజయంతో భాజపా స్వతంత్రంగా పాలించే రాష్ట్రాల సంఖ్య  15కు చేరనున్నాయి. అదనంగా బిహార్‌లో జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, మేఘాలయ లో నేషనల్ పీపుల్స్ పార్టీ తదితరాలతో కలిపి భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి చేరుతోంది. దాదాపు 75శాతం రాష్ట్రాలు బిజెపి గుప్పిట ఉన్నట్లే. కనుక పాలనలో మార్పు కనిపించాలి. ప్రజలకు బిజెపి పట్ల అనురాగం పెరగాలి. ఇజెపికి ఓటేసినందుకు ప్రజలు ఆనందపడాలి. అందుకు అనుగుణంగా పాలనా పరమైన మార్పులు రావాలి. రాజకీయ పందురాలకు, ఉచిత పథకాలకు దూరంగా ఉండాలి. పన్నుల రూపంలో వచ్చే డబ్బులను అభివృద్ధికే వినియోగించాలి.  అప్పుడే బిజెపిని మరోమారు ప్రజలు నమ్ముతారు. అందుకు కఠినమైన నిర్ణయాలకు కూడా వెనకాడరాదు.

# సమాన అవకాశాలు లేని బిసి కులాలు




దేశాన్ని, రాష్ట్రాల్ని పాలించే వారిలో అగ్ర కులాలకు చెందినవారే ఎక్కువగా ఉంటారు. జనాభాలో సింగిల్ డిజిట్ శాతం ఉన్న ఉన్నత వర్గీయులు వరుసగా తెలుగువారి ఏలికలుగా ఉంటున్నారు. అధిక సంఖ్యాకులైన దిగువ కులాలవారికి లభించే పదవులు కూడా అలాంటి పాలకుల దయపైనే ఆధారపడి వస్తాయి. ఈ మధ్య కాలంలో బీసీల్లో వచ్చిన సామాజిక చైతన్యం కారణంగా వారిని బుజ్జగించేందుకు పదవుల్లో కొంత ప్రాధాన్యత కనబరుస్తున్నారు. మంత్రివర్గంలో మాకెన్ని దక్కాయి అనే నిశిత చూపు కూడా బీసీల్లో పెరిగింది. మూడు, నాలుగు పదవుల నియమాకం జరిగితే అందులో ఒక్కటైనా బీసీకి ఇచ్చే పరిస్థితి వచ్చింది. లేదంటే బీసీలకు అన్యాయం అంటూ మీడియాలో విమర్శల వెల్లువ మొదలౌతుంది. మునపటి కన్నా బీసీ నేతల వార్తల కవరేజికి పత్రికలు ఎక్కువ చోటును ఇస్తున్నాయి. ఆ నాయకుల వెనుక పెద్ద సంఖ్యలో బీసీ విద్యార్థులు, యువత ఉన్నారన్న ముందు జాగ్రత్తలు మీడియా తీసుకుంటోంది. ఈ మధ్య తెలంగాణ ప్రభుత్వం బయట పెట్టిన రాష్ట్ర జనాభా ఆర్థిక , సామాజిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణాంకాల నివేదిక 2024 ద్వారా తెలంగాణ జన జీవన ముఖచిత్రం వెలుగులోకి వచ్చింది. అందులో ఉన్న కులాలవారీగా జనాభా సంఖ్య ఎన్నో కొత్త విషయాలను బయట పెట్టింది. ప్రత్యేకంగా బీసీ కులాలు, వారి జనాభాతో పాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు క్షుణ్ణంగా తెలియవచ్చాయి. బీసీల మధ్య అంతర్గతంగా ఉన్న హెచ్చు తగ్గులు లెక్కలు కూడా బయటపడ్డాయి. బీసీలందరం ఒకటే అనే భావనతో వెళు తున్న వారిలో ఏ కులాలు ముందున్నాయి, ఏవి వెనుకున్నాయి అనే విషయాన్ని ఈ కొత్త గణాంక వివరాలు స్పష్టం చేశాయి. బీసీల పేరిట లభిస్తున్న రాజకీయ అవకాశాలు, పదవులు కేవలం కొన్ని బీసీ కులాల దగ్గరే ఆగిపోతున్నాయనే విషయం ఈ నివేదిక ద్వారా తేలిపోయింది. దీని ప్రకారం బీసీల్లో ఏ కులం జనాభా ఎక్కువ ఉందో వారికి మాత్రమే బీసీ కోటా దాదాపు పూర్తిగా దక్కుతోంది. బీసీల్లో జనాభాపరంగా, ఆర్థికంగా బలంగా ఉన్న నాలుగైదు కులాలు బీసీ రాజకీయ అవకాశాలను వశపరచుకుంటున్నాయి. బీసీ కేటగిరీల్లో డి,బిలకు చెందినవారే బీసీ కోటాలో పార్టీ టికెట్లు పొంది చట్టసభల్లో అడుగుపెడుతున్నారు. మార్పు కోసం ఇచ్చిన ప్రజాతీర్పు దాదాపు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నుండి అదే తంతు సాగుతోంది. నియోజకవర్గాల్లో ఏదైనా బీసీ కులం జనాభా 20% పైగా ఉంటే అదే కులానికి చెందిన స్థితిమంతుణ్ణి పార్టీలు తమ బీసీ అభ్యర్థిగా ఎంచుకుంటున్నాయి. మిగతా కులాల బీసీలు అదే బీసీని బలపరచడం వల్ల గెలుపు అవకాశాలు మెరుగుపడతాయి. ఇలా ప్రతిసారి వెనుక ఉండి బలపరచి కులాలు బలపరుస్తూనే ఉంటాయి తప్ప చట్టసభల్లో అవి అడుగు పెట్టడం లేదు. కొన్ని బిసి కులాల జన సంఖ్య ఎక్కువగా ఉన్నా పార్టీ టికెట్ కేటాయించదు. కారణం వారు ఎన్నికల ఖర్చును తట్టుకొనే స్థాయిలో లేకపోవడమే. అలాంటి చోట పార్టీలు అగ్ర కులాల వారి వైపు మొగ్గు చూపుతాయి. జనాభాపరంగా ముందు ఉండి, ఆర్థికంగా లేని కులం వారికి టికెట్ ఇవ్వండి, మేం ఒక్కటై గెలిపించుకుంటాం అని మిగతా బీసీలు ముందుకు రారు. కారణం బీసీల్లో ఉన్న అంతర్గత వైవిధ్యాలు అని చెప్పాలి. పేరుకు బీసీలే కానీ ఏ – కేటగిరిలో ఉన్నవారు పట్ల డి – కేటగిరిలో ఉన్నవారికి చిన్నచూపు. స్పష్టంగా చెప్పాలంటే బీసీ – ఏ కులాలను బీసీ – బి, డి కులాలు దూరంగా ఉంచుతాయి. బీసీలే అయిన చాకలి, మంగలి పనివాళ్లను పై బీసీ కులాలు తమతో సమానంగా చూడవు. మంగలిని తాకితే స్నానం చేసే బీసీ కుటుంబాలు ఇప్పటికీ ఉన్నాయి. తెలంగాణ సమగ్ర కుల గణన 2024 రిపోర్ట్ ప్రకారం 133 బిసి కులాల్లో 69 కులాలు పూర్తిగా వెనుకబడినవి కాగా మిగతా 64 సాధారణ వెనుకబాటులో ఉన్నాయి. జనాభా పరంగా చూస్తే పది వేలు కూడా లేని కులాలు 54 ఉన్నాయి, లక్ష లోపు జనాభా ఉన్న కులాలు 43 ఉన్నాయి, లక్ష పైన జనసంఖ్య ఉన్న కులాలు 22 ఉన్నాయి. లక్ష పైనున్న కులాల్లో పది లక్షలు, ఆపై జనం ఉన్నవి వరుసగా ముదిరాజ్, యాదవ, గౌడ్, కాపు, పద్మశాలి కులాలు వస్తాయి. చాకలి కులస్తులు పదిలక్షల దరిదాపున ఉన్నారు. బీసీల్లో రాజకీయంగా ఎదిగిన, అవకాశాలను అందిపుచ్చుకున్నవారు పది లక్షలపై జనాభా ఉన్నవారే మొత్తంగా ఉన్నారు. చాకలి నుండి ఒకరు ఎమ్మెల్యే కాగలిగారు. ఏ పార్టీలో చూసినా పైన పేర్కొన్న ఐదు కులాల నుంచే బీసీ సీట్ల కేటాయింపు జరుగుతుంది. ప్రభుత్వాల ఆత్మవంచనలో ఆగమైన ముదిరాజుల బతుకులు! జనాభా పరంగానే కాకుండా బీసీల్లో ఆర్థికంగా బలమైన కులాలు కూడా అవే కావడం వల్ల పార్టీలు వారినే వెదుక్కుంటున్నాయి. ఈ ఐదు కులాలు కాకుండా మిగతా వందకు పైగా ఉన్న బిసి కులాలకు రాజకీయంగా పదవులు దక్కే అవకాశాలు లేవనే చెప్పాలి. జన, ధన బలం లేని బీసీలు కేవలం ఆ ఐదు కులాల అభ్యర్థులను గెలిపించే వ్యక్తులుగానే మిగిలిపోతున్నారు. వారికి కూడా రాజకీయ అవకాశాలు దక్కాలి. ఎమ్మెల్యేలు, ఎంపీలు కాలేకపోయినా బాగా వెనుకబడిన బీసీలకు గ్రామాల్లో, పట్టణాల్లో వార్డు మెంబర్లుగా ప్రాధాన్యతనియ్యాలి. మిగతా క్రీమీ లేయర్ బీసీలు వారిని కలుపుకొని మద్దతుగా నిలవాలి. వారిని గెలిపించేందుకు కృషి చేయాలి. ఆ ప్రయత్నం మాత్రం పార్టీల నుండి గాని, స్థానిక బీసీ నేతల వైపున గాని జరగడం లేదు. ఎవరైనా కింది బీసీలు ముందుకొస్తే మేమున్నాం కదా మీరెందుకు, ఓడిపోతావేమో అని వారిని పై బీసీలు నిరుత్సాహపరుస్తున్నారు. జనాభా తక్కువ ఉన్న బీసీ కులాల్లో సమర్థులున్నా వారిని జన, ధన తరాజులోనే పార్టీలు తూకం వేస్తున్నాయి. 'మేమెంతో మాకంత' అన్న నినాదం అన్ని కులాలకు వర్తించాలి కదా!

# ఒకే ఒక్క ఓటుతో మాజీమంత్రి ఓటమి

## టివికె చేతిలో ఒక్క ఓటుతో ఓడిన పెరియకరుప్పన్

చెన్నై,మే5 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ సృష్టించిన ప్రభంజనంలో పలువురు చిత్తయ్యారు.  విజయ్ నేతృత్వంలోని ఆ పార్టీ 108 సీట్లు సాధించి.. అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీగా అవతరలించింది. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. అయితే విజయ్ వేవ్‌లో డీఎంకే నేతలు చెల్లాచెదురయ్యారు. ఆ రాష్ట్ర సహకార శాఖ మాజీ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ అనూహ్య రీతిలో ఓటమిపాలయ్యారు. ఆయన కేవలఅం ఒకే ఒక్క ఓటు తేడాతో ఓటమి చెందారు. తిరుప్పత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తమిళగ వెట్రి కజగం పార్టీ నుంచి సీనివాస సేతుపథి పోటీ చేశారు. అయితే తాజా ఫలితాల్లో టీవీకే నేతకు 83, 375 ఓట్లు పోలయ్యాయి. ఇక రెండవ స్థానంలో పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు పడ్డాయి. చాలా ఆసక్తికరంగా ఈ రేస్ కొనసాగింది. చివరి రౌండ్ వరకు పోటీ నువ్వానేనా అన్నట్లుగా సాగింది. చివరి రౌండ్ కన్నా ముందు రౌండ్‌లో 30 ఓట్ల ఆధిక్యంలో డీఎంకే నేత పెరియకరుప్పన్ ఉన్నారు. కానీ అనూహ్యమైన రీతిలో మాజీ మంత్రికి షాక్ తగిలింది. చివరి రౌండ్‌లో టీవీకే నేత సీనివాస సేతుపథ పుంజుకుని విజయాన్ని నమోదు చేశారు. పెరియకరుప్పన్ కన్నా ఒక్క ఓటు ఎక్కువ ఆర్జించారు. దీంతో టీవీకే నేత థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేశారు. తిరుప్పత్తూరు స్థానం నుంచి పోటీ చేసిన బీజేపీ నేత కేసీ తిరుమరన్ మూడవ స్థానంలో నిలిచారు. ఆయనకు 29,054 ఓట్లు పోలయ్యాయి.




# సామాన్యులను అక్కున చేర్చుకున్న ఓటర్లు

## ప్రజల్లో ఆదరణతో బెంగాల్లో పనిమనిషి గెలుపు

కోల్‌కతా,మే5 : పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో ఓ మహిళ విజయం ఆసక్తికరంగా మారింది. భాజపా తరపున పోటీ చేసిన కలితా మాఝీ అనూహ్యంగా రాజకీయ యవనికపై దూసుకు వచ్చి ఎమ్మెల్యే అయ్యారు. ఓ సామాన్యురాలని చట్టసభకు తీసుకుని వచ్చిన ఘనత బిజెపిదే అని చెప్పకతప్పదు.  ఔస్‌గ్రామ్ నియోజకవర్గంలో ఆమె గెలుపొందారు. టీఎంసీ అభ్యర్థిపై 12,535 ఓట్లతో విజయం సాధించారు. మాఝీ.. గతంలో పలు ఇళ్లల్లో పనిమనిషిగా పనిచేశారు. నెలకు రూ.2,500 సంపాదించేవారు. ఆస్తులు, అంతస్తులు లేకపోయినప్పటికీ.. తన మంచితనంతో ఆమె ఇంతటి భారీ విజయాన్ని సాధించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.  గుస్కారా మున్సిపాలిటీకి చెందిన మాఝీ రాజకీయాల్లోకి రాకముందు పలు ఇళ్లల్లో సహాయకురాలిగా పని చేశారు. 2021 ఎన్నికల్లో భాజపా ఆమెకు సీటు ఇవ్వడంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన అభేదానంద థాండర్ చేతిలో ఓడిపోయారు. అయినప్పటికీ స్థానికులతో ఆమెకున్న సంబంధాలపై విశ్వాసంతో భాజపా మరోసారి తాజా ఎన్నికల్లో అవకాశం ఇవ్వడంతో ఈసారి ఆమె తన నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. సాధారణ పౌరులు సైతం ఎన్నికల్లో విజయం సాధించవచ్చని నిరూపించారు. మాఝీ విజయం బెంగాల్ రాజకీయాల్లో ఒక నిర్మాణాత్మకమైన మార్పును సూచిస్తోంది. మరోవైపు తమిళనాడులోనూ ఓ ఆటోడ్రైవర్ టీవీకే తరపున ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యాడు. టీవీకే అధినేత విజయ్ కారు డ్రైవర్ కుమారుడు కూడా ఈ ఎన్నికల్లో భారీ విజయం సాధించాడు. ఇలా పలుచోట్ల పలు రకాలుగా వార్తలు వస్తున్నాయి.

# సత్యనిష్ఠే.. ఏకైక మార్గం

'భావనమే' జీవనం. జీవ దేహం కేవలం ఒక ఉపకరణం. ఇంద్రియ గ్రహణం, ప్రజ్ఞ, ఉద్వేగాలు, అభ్యాసం, అస్తిత్వరూపం, నిర్ణయాలు, పట్టుదల, అనుభూతి విస్తృతి.. అన్నీ భావప్రపంచమే. అయితే .. ఈ భావప్రపంచం సత్య, శాంత, స్పష్ట సమర్థతతో, సుసంస్కారంతో సాగాలంటే.. శరీరం సంతులిత సమర్థతతో పనిచేస్తూ ఆరోగ్యంగా ఉండటం అత్యవసరం. కానీ, తగినంత ఆరోగ్యంగా ఉన్నవారిలో కూడా చాలావరకు భావప్రపంచం సమర్థతతో పనిచేయకపోవడం కీలకమైన సమస్య. అందులోనూ అధికారం, ధనం, విద్య (మేధస్సు) ఉన్నవారిలో ఈ దోషం ఉండటం సమాజానికి ప్రబలమైన సమస్య. భావప్రపంచాన్ని సంస్కార బలంతో నడుపగలిగింది సదా 'సత్యనిష్ఠ'. సత్యజీవనం.. విద్య. అసత్య జీవనం.. అవిద్య. దైనందిన మానవ జీవనం సత్యాసత్యాల 'మిశ్రమం'. 'సమానతా భావమయమైన' సరళ జీవనం, సమష్టి శాంతి, నిర్భయత, ఆరోగ్యం, కృషి, పరస్పర ఆదరణ, ఆధ్యాత్మిక సాధన, సంతృప్తి, ఆనందా నుభవం ఇవన్నీ అనివార్యంగా సత్యాన్ని ఆశ్రయించి సాగుతుంటాయి. 'ఆధిక్యతాభావమయమైన' సంపద్గత జీవనం, కాంక్ష , ప్రకృతిశోషణ, ఘర్షణ, హననం, ఆక్రమణ, ప్రాణ నష్టం, భయం ఇవి అసత్యాన్ని ఆశ్ర యించి సాగుతాయి. మానవ 'జీవితాన్ని శాసించవలసిన సత్యాలు.



ఆధ్యాత్మికం

# అంతర్రాష్ట్ర దొంగలకు రాష్ట్ర ముఖ్యమంత్రికి లింకు పెడతావా

**• తీరు మార్చుకోకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు గట్టి బుద్ధి చెప్తారు • బండి సంజయ్‌కి దమ్ముంటే కాళేశ్వరం కేసులో కేసీఆర్ కేటీఆర్‌కు సీబీఐ ద్వారా నోటీసులు ఇప్పించాలి • కరీంనగర్‌లో పీఎంజే జువెల్లరీ బాధితులను పరామర్శించిన మంత్రి అడ్లూరి**

**కరీంనగర్ టౌన్, మే5(ది క్రైమ్ న్యూస్):** పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేదంటే రాష్ట్రంలోని 33 జిల్లాల కాంగ్రెస్ కార్యకర్తల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హెచ్చరించారు. కరీంనగర్ లో పీఎంజే జ్యువెల్లరీ షాప్ లో ఆదివారం జరిగిన సంఘటనలు గాయపడ్డ బాధితులను కరీంనగర్ లోని ప్రైవేటు ఆసుపత్రిలో మంత్రి అడ్లూరి మంగళవారం పరామర్శించారు. అనంతరం కరీంనగర్ లోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ జువెల్లరీ షాప్ లో జరిగిన దొంగతనం కాల్పుల ఘటన దురాదృష్టకరమని మంత్రి అడ్లూరి అన్నారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠా రెక్కీ నిర్వహించి పక్కా ప్రణాళిక ప్రకారం దొంగతనం చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలిందని మంత్రి వివరించారు. కరీంనగర్ దొంగతనం కేసులో నిందితులను పట్టుకోవడానికి 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, నేరస్తులను పట్టుకోవడానికి ఇతర రాష్ట్రాల పోలీసుల సహకారం తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. బాధితుల పరామర్శ పేరుతో కరీంనగర్ కు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నోటికి వచ్చిన విధంగా మాట్లాడారని మంత్రి మండిపడ్డారు. అంతర్రాష్ట్ర దొంగలను రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రితో పరిచయం ఉందని కేటీఆర్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. 2014 నుండి 2023 వరకు అధికారంలో ఉన్న టీఆర్ఎస్, బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో జరిగిన దోపిడీలు, దొంగతనాలు, హత్యలకు ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యత వహిస్తాడా అని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. అధికారంలో ఉన్న సమయంలో కేటీఆర్ అక్రమంగా సంపాదించుకొని జన్వాడాలో ఫామ్ హౌస్ నిర్మాణం చేసుకొని విలాసవంతమైన జీవితం గడుపుతున్న విషయాన్ని తెలంగాణ ప్రజలకు చూపించాలని నాటి పీసీసీ అధ్యక్షులుగా ఉన్న రేవంత్ రెడ్డి డ్రోన్ కెమెరా ద్వారా ఫామ్ హౌస్ చిత్రీకరణ చేస్తే నాటి ప్రభుత్వం రేవంత్ రెడ్డి పై అక్రమ కేసు బనాయించి చెంచల్ గుడా జైలుకి పంపించారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అక్రమ కేసులో అరెస్టు చేసి జైలుకు పంపిన టీఆర్ఎస్ నాయకులు నేడు అంతర్రాష్ట్ర దొంగలకు ముఖ్యమంత్రికి సంబంధాలు ఉన్నాయని మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జువెల్లరీ దాడి ఘటనలో గాయపడిన వారిని పరామర్శించడానికి కాంగ్రెస్ నాయకులు రాలేదని కేటీఆర్ చేసిన ఆరోపణ లు ఎలాంటి వాస్తవం లేదని మంత్రి అన్నారు. సంఘటన జరిగిన రోజు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తో పాటు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వెలిచాల రాజేందర్ రావు తదితరులు పరామర్శించారని మంత్రి గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో మంథనిలో జరిగిన జంట హత్యల ఘటనలో ఇద్దరు న్యాయవాదులు మరణిస్తే నాడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఎందుకు బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదని మంత్రి ప్రశ్నించారు. చనిపోయిన వ్యక్తి మరణ వాంగ్మూలంలో సైతం బీఆర్ఎస్ నాయకులకు తమ హత్యకు సంబంధం ఉందని చెప్పినప్పటికీ నాడు ప్రభుత్వంలో ఉన్న కేటీఆర్ ఎందుకు పట్టించుకోలేదని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నేరెళ్ల దళితులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తే ఎందుకు నేటికీ కేటీఆర్ నోరు మెదప లేదని మంత్రి అడ్లూరి అన్నారు. కొండగట్టు బస్సు ప్రమాదంలో 62 మంది మరణిస్తే బాధితులను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు పరామర్శించలేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో ఎక్కడ ఎలాంటి దురాదృష్ట సంఘటన జరిగిన ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యలు అందించడంలో ముందుంటున్నారని మంత్రి తెలిపారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మానుకొని కాళేశ్వరం కేసులో సీబీఐ ద్వారా కేసీఆర్ కు నోటీసులు ఇప్పించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాలపై స్పందించిన మంత్రి లక్ష్మణ్ కుమార్ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. సినీ నటుడిగా రాణించి పార్టీ ప్రారంభించిన ఎనిమిది నెలల్లోనే ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఎన్నికైన ఎన్టీ రామారావు కు సైతం ఓటమి తప్పలేదని గుర్తు చేశారు. దేశంలో అత్యంత ప్రమాదకరమైన పార్టీ బీజేపీ అని దళితులు, బీసీల రిజర్వేషన్లను ఎత్తివేయడానికి బీజేపీ కుట్ర చేస్తుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. కరీంనగర్ జ్యువెల్లరీ నిందితులను త్వరలోనే పట్టుకొని చట్టపరంగా శిక్షిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.



# అదే బాష తనపై వాడితే ఏమనిపిస్తదో బండి సంజయ్ ఆలోచించాలి

**• పగటి కలలుగనుడాపి జనాలకు ఏంజేత్తవో చెప్పుజెర: జీవి రామకృష్ణారావు**

**మానకొండూర్, మే5(ది క్రైం న్యూస్):** కేంద్ర మంత్రి బండి సంజయ్, మాజీమంత్రి కే.టి.ఆర్ ను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. రాజకీయాల్లో ప్రజా సమస్యలపై విమర్శలుండాలిగానీ వ్యక్తిగత దూషణలు చేయడం అనైతికమంటూ కేటీఆర్, కేసిఆర్ కుమారుడేనని నిరూపించు కోవాలంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమన్నారు. హైదరాబాద్‌లో భూకబ్జా వ్యవహారాలపై కేటీఆర్ చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పలేక, రేవంత్ రెడ్డితో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలపై స్పందించలేక వ్యక్తిగత దూషణలకు దిగడంతో బండి సంజయ్ అసహనం బయటపడిందన్నారు. కాళేశ్వరం, ఈ ఫార్ములా, ఫోన్ ట్యాపింగ్ అంశాలపై బండి సంజయ్ ఎన్నోసార్లు ఆరోపణలు చేసినప్పటికీ, కేటీఆర్ ఎప్పుడూ ధైర్యంగా సమాధానాలిచ్చారే కానీ బండి సంజయ్ ని వ్యక్తిగతంగా దూషించలేదని, దేవుళ్ళ పేర్లు వాడే బండి సంజయ్ ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యకరమని, ఆర్ఎస్ఎస్, ఎబివిపిల్లో బండి సంజయ్ కి ఇదే శిక్షణ ఇచ్చారా అనే ప్రశ్న ఉత్పన్నమవు తోందన్నారు. నిజమైన హిందువులుగా సంస్కృతి, గౌరవం, నియంత్రణ, నైతిక విలువలతో దేవుళ్లను రాజకీయ ప్రయోజనాల కోసం వాడక భక్తితో పూజిస్తామని, కేంద్ర మంత్రిగా తన బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైన బండి సంజయ్ అదే బాషను తనపై వాడితే ఏమనిపిస్తదో ఆలోచించాలని హితవు పలికారు. తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని సంపాదించడంలో బిజెపి విఫలమైందని ఈ పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల విజయాలను చూపించి ఇక్కడ కూడా గెలుస్తామని చెప్పడం తన బుద్ధి తక్కువ తనానికి నిదర్శనమన్నారు. తెలంగాణలో బీజేపీకి బలమైన నాయకత్వం ఉందా, ప్రజల సమస్యలపై ఎక్కడ, ఎలా పోరాడుతున్నారో ప్రజలకు స్పష్టంగా చెప్పగలరా అంటూ ప్రశ్నిస్తూ వాస్తవాలను అర్థం చేసుకోకుండా, ఊహాజనిత అంచనాలపై ఆధారపడి మాట్లాడడం తప్ప బండి సంజయ్ చేసేదేమి లేదన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు పార్లమెంట్‌లో ఉన్నా, రాష్ట్ర హక్కుల కోసం పోరాడిన చరిత్ర లేకపోగా తెలంగాణపై అన్యాయం జరుగుతుంటే ఒక్కరూ గళం విప్పలేకపోవడం వారి రాజకీయ బలహీనతను బయట పెడుతోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కొత్త ప్రాజెక్టులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమవ డంతోపాటు యూరియా కొరత, పెట్రోల్, గ్యాస్ ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ, బీజేపీ నాయకులు నిశ్శబ్దంగా ఉండటం బాధ్యతారా హిత్యమన్నారు. బీజేపీ ప్రజలకు ఉపయోగపడే శక్తిగా కాదుకదా ప్రత్యామ్నాయంగా కూడా కనిపించడం లేదని విమర్శిస్తూ కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బండి సంజయ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నట్లు జీవీ ప్రకటనలో పేర్కొన్నారు.




# ఓపెన్ జిమ్ లను ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**• రూ.కోటి సీఎస్ఆర్ నిధులతో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు • దుర్శేడు, కిసాన్ నగర్‌లో ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్**






**కరీంనగర్ టౌన్, మే5(ది క్రైమ్ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ "ఫిట్ ఇండియా' నినాదాన్ని పురస్కరించుకుని కరీంనగర్ ప్రజలకు ఓపెన్ జిమ్ లు అందుబాటులోకి వచ్చాయి. దాదాపు కోటి రూపాయల వ్యయంతో 17 డివిజన్లలో ఓపెన్ జిమ్ లను ఏర్పాటవుతున్నాయి. నాల్కో సంస్థ అందిస్తున్న సీఎస్సార్ నిధుల సహకారంతో మలయప్ప ఫౌండేషన్ నిర్వాహకులు ఈ ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేస్తున్నరు. అందులో భాగంగా ఈరోజు నగరంలోని కిసాన్ నగర్ అంబేద్కర్ యూత్ క్లబ్ సమీపంలో, దుర్శేడులో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఓపెన్ జిమ్ లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆయా ఓపెన్ జిమ్ లను కేంద్ర మంత్రి ప్రారంభించారు. కేంద్ర మంత్రి సహకారంతో పూర్తిగా ప్రైవేట్ సంస్థలు అందిస్తున్న సీఎస్సార్ నిధులతోనే ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేసినట్లు మలయప్ప ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ గడ్డం అరుంజయ్, గడ్డం అనూష తెలిపారు. నిత్యం ఉరుకులు పరుగులతో ఉద్యోగాల్లో బిజీగా ఉంటూ శారీరక ఫిట్ నెస్ ను కోల్పోతున్న వారికి ఈ ఓపెన్ జిమ్ లు ఎంతగానో ఉపయోగ పడతాయని తెలిపారు. కరీంనగరలో మొత్తం 17 డివిజన్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కరీంనగర్ ప్రజలంతా ఈ ఓపెన్ జిమ్ లను ఉపయోగించుకుని శారీరక ధ్రుఢత్వాన్ని పెంచుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు.

# ఉద్యమకారులని గుర్తించని బీఆర్ఎస్

**- గడ్డపోతారం మున్సిపాలిటీలో కో-ఆప్షన్ ఎన్నికలపై వివాదం**

**పటాన్చెరు, మే 05(ది క్రైమ్ న్యూస్):** గడ్డపోతారం మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక వివాదాస్పదంగా మారింది. ఈ సందర్భంగా నారబోయిన సరితా శ్రీనివాస్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనను కో-ఆప్షన్ సభ్యురాలిగా ఎంపిక చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హామీ ఇచ్చి చివరికి మోసం చేశారని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులకు సరైన గుర్తింపు లేదని,



డబ్బులు ఖర్చు చేసిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆమె విమర్శించారు. అంతేకాకుండా, కౌన్సిలర్లు స్వచ్ఛందంగా కాకుండా అధిష్టానం ఒత్తిడితోనే లక్ష్మి ప్రకాష్ చారిని ఎన్నుకున్నారని మండిపడ్డారు. ఈ పరిణామం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# క్యాన్సర్ భూతాన్ని పారదోలే అద్భుత ఫలం..

ఆప్రికాట్ పండు చాలా రుచికరమైన పండు. యాంటీఆక్సిడెంట్లతో నిండిన ఈ పండులో పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకంగా వ్యవహరిస్తుంది. వీటిని రోజు వారీ ఆహారంలో క్రమం తప్పకుండా తింటే ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. ఆప్రికాట్ పండును సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. ఇందులో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. అయితే పోషకాలు మాత్రం పుష్కలంగా ఉంటాయి. ఆప్రికాట్ పండ్లలో బీటా కెరోటిన్, లుటిన్, పొటాషియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, జియాక్సంతిన్ అధికంగా ఉంటాయి. ఇందులో బీటా కెరోటిన్, విటమిన్ ఎ, జియాక్సంతిన్ ఉంటాయి. ఈ మూడు పదార్థాలు కళ్లకు ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్‌పండ్లు కంటిశుక్లం, రేచీకటి ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఆప్రికాట్ పండ్లలో వివిధ రకాల ఫైబర్ ఉంటుంది. కాబట్టి ఈ పండు తింటే జీర్ణం సులువుగా కడుపు క్లీన్ చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఈ పండు ఎంతగానో ఉపయోగపడుతుంది. బీటా-కెరోటిన్, లుటిన్, జియాక్సంతిన్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు వంటి పదార్థాలు శరీరంలోని యాంటీ-క్యాన్సర్ ఏజెంట్లుగా పనిచేస్తాయి. కాబట్టి ఇది రక్తపోటును పెంచదు. ఆప్రికాట్ కూడా కాలేయం దెబ్బతినకుండా కాపాడుతుంది. ఈ పండు కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆప్రికాట్ పండ్లు శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ తగ్గకుండా కాపాడుతాయి. అంటే మీరు ఎంత కష్టపడి పనిచేసినా శరీరం బలహీనపడకుండా ఉంటుంది.

# నీటిలో మునిగి విద్యార్థి మృతి

**మధిర ప్రతినిధి మే 5:(ది క్రైమ్ న్యూస్):** మధిర మండలం వంగవీడు గ్రామంలో మంగళవారం నాడు బ్రిడ్జిని చూద్దామని ఐదుగురు విద్యార్థులు కలిసి బ్రిడ్జి దగ్గరకు వెళ్లారు, దగ్గరలో ఉన్న నీటిలోకి వెళ్లారు, నీరు ప్రవాహం ఎక్కువగా ఉండటంవల్ల ఐదుగురు విద్యార్థుల్లో,ఒకరు నీటిలో మునిగి మరణించారు. మృతుని తల్లిదండ్రులు గుడిద జితేంద్ర కుమార్తె దీక్షిత (12)6వ తరగతి చదువుతున్న విద్యార్థి మృతి చెంది. కుటుంబ సభ్యులు తల్లిదండ్రులు, కన్నీరు మున్నీరు లో మునిగిపోయారు.



# రైతులు ఉద్యాన పంటలు ఆయిల్ ఫామ్ సాగు చేయాలి

**- మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి నరసింహారావు**



**మధిర ప్రతినిధి మే 5:(ది క్రైమ్ న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు వారము ప్రోగ్రాంలో మంగళవారం నాడు ఉద్యాన పంటల సాగు ఆయిల్ పామ్ సాగు పెంపు ప్రత్యామ్నాయ పంటలు సాగు కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు పాల్గొని మాట్లాడుతూ ఈ రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి తెలియజేశారు. రైతులు మొక్కజొన్న పంట అయిపోయిన తర్వాత వాటి యొక్క అవేశేషాలను కాల్చవద్దని సూచించారు అలా కాల్చితే భూసారము మరియు భూమిలో మేలు చేసే సూక్ష్మజీవులు వానపాములు అన్ని చనిపోతాయని విపరీతమైన ఆస్తి నష్టము అని ప్రాణ నష్టము జరిగే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికారం ప్రతినిధి, కర్నాటి రామారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, అత్త కమిటీ డైరెక్టర్లు, మీ మీద గ్రామ సర్పంచులు వివిధ గ్రామ సర్పంచులు, అగ్రికల్చర్ అధికారులు పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లింగంపల్లి శేఖర్ కుటుంబానికి వెలిచాల రాజేందర్ రావు పరామర్శ



**కరీంనగర్ టౌన్, మే5(ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లింగంపల్లి శేఖర్ మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శేఖర్ నివాసానికి మంగళవారం వెళ్లిన రాజేందర్ రావు, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. శేఖర్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజేందర్ రావు మాట్లాడుతూ శేఖర్ పార్టీలో సుదీర్ఘకాలం సేవలందించిన మంచి వ్యక్తి అని, ఆయన మరణం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ పరామర్శలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల నరసయ్య, ఆకుల నందిని ఉదయ్, వేల్పుల వెంకటేష్, గండి రాజేశ్వర్, గండి శ్యామ్, గండి గణేష్, లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలపై వ్యతిరేకతతో ఓటమిపాలయ్యారు

**కమ్యూనిస్టులు ఏకం కావాలి సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి**



**కరీంనగర్ టౌన్, మే5(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడిన చాడ వెంకటరెడ్డి తాజా రాజకీయాలపై స్పందించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలను చూస్తే ప్రభుత్వ వ్యతిరేక ఓటు పని చేసిందనేది స్పష్టమైందన్నారు. వామపక్షాలకు ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడ్డదనేది వాస్తవమని, కానీ కమ్యూనిస్టు సిద్దాంతం అజేయమైందన్నారు. ఏదిఏమైనా ఓట్ల రాజకీయ ప్రక్రియలో ఆటుపోట్లు సహజమని వాటిని ఎదుర్కోని మళ్లి పుంజుకునేందుకు క్రుషి జరుగాలన్నారు. అందుకు తగిన చర్చలు సాగుతాయన్నారు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటికరణ విధానాలతో పెట్టుబడి దారుల ఆస్తులు ఓవైపు పెరుగుతూ పోతుంటే పేదవాడు మరింత పేదవాడుగా మారుతున్నాడని అన్నారు. ఈ సందర్భంలో వామపక్ష శక్తులు, అభ్యుదయ వాదులు, ప్రజాతంత్ర వాదులు ఒక వేదిక పైకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి అకాల వర్షాల నేపథ్యంలో ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కండ్ల ముందే నీటి పాలవుతుందని ఈ పరిస్థితిల్లో రాష్ట్ర ప్రభుత్వం తడిసిన దాన్యాన్ని, మక్కలను కొనుగోలు చేయాలని చాడ వెంకటరెడ్డి కోరారు. పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం అందజేయాలన్నారు. గత ప్రభుత్వం ఎకరానికి పది వేలు ఇస్తామని చెప్పి ఇయ్యలే... కనీసం ఈ ప్రభుత్వమైన పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, వి.ఎస్.బోస్, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నాయకులు యూసఫ్, బాల్ రాజ్, టేకు మల్ల సమ్మయ్య, నరసింహ, ప్రవీణ్, కరుణ, బుచ్చన్న యాదవ్ ఉన్నారు.

# పారదర్శకతతో సంక్షేమ పథకాల అమలు..

● అభివృద్ధి..సంక్షేమమే మా తొలి ప్రాధాన్యత.. ● పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

● 226 మంది లబ్ధిదారులకు రెండు కోట్ల 26 లక్షల రూపాయల విలువైన కళ్యాణ లక్ష్మి..షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..

**పటాన్చెరు, మే 05(ది క్రైమ్ న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందిస్తూ పూర్తి పారదర్శక పాలన అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్చెరు లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. రామచంద్రాపురం, పటాన్చెరు, అమీన్పూర్ రెవెన్యూ మండలాల పరిధిలోని 226 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదన్న సమున్నత లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అని విప్లవాత్మక పథకాన్ని పెట్టారని గుర్తు చేశారు. పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు తెలిపారు.. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి



ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సెప్టిక్ షాక్‌తో కిడ్నీ సమస్య : యశోద వైద్యుల అత్యాధునిక చికిత్సతో ప్రాణాపాయం నుంచి బయటపడిన రోగి

**ఖమ్మం, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** సెప్టిక్ షాక్‌తో మల్టీ ఆర్గన్ డిస్‌ఫంక్షన్, ఆక్యూట్ కిడ్నీ ఇంజరీతో బాధపడుతున్న ఖమ్మం జిల్లాకు చెందిన 51 ఏళ్ల మహిళకు యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మలక్‌పేట్‌లో విజయవంతంగా చికిత్స అందించారు. కమ్యూనిటీ–అక్వైర్డ్ న్యూమోనియా (జ్వరా) కారణంగా పరిస్థితి విషమించి, శ్వాస ఇబ్బంది, కాళ్ల వాపు, మూత్ర విసర్జన తగ్గడం వంటి లక్షణాలతో రోగి అత్యవసరంగా ఆసుపత్రిలో చేరారు. డా. చెతన్ వీరమనేని నేతృత్వంలోని నెఫ్రాలజీ, పుల్మనాలజీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల సమన్వయంతో రోగికి సమగ్ర చికిత్స అందించారు. అధునాతన డయాలిసిస్ విధానాలు అయిన ఫిల్టర్‌తో) మరియు అనంతరం గూజుణ సెషన్లు నిర్వహించి, శరీరంలో చేరిన విషతుల్యాలను తొలగించారు. న్యూమోనియా మరియు ప్లూరల్ ఎఫ్యూషన్‌కు ప్రత్యేక యాంటీబయోటిక్స్, శ్వాస సహాయక చికిత్స అందించగా, హృదయ పనితీరును స్థిరపరచడానికి అవసరమైన చికిత్సలు కూడా చేశారు. సమయానికి చేపట్టిన చికిత్స, మల్టీ–డిసిప్లినరీ వైద్య బృందం సమన్వయం, ఆధునిక సాంకేతిక సదుపాయాల వల్ల రోగి ఆరోగ్యం మెరుగై ఎటువంటి క్లిష్టతలు లేకుండా డిశ్చార్జ్ అయ్యారు. ఇలాంటి క్లిష్టమైన సెప్సిస్ కేసుల్లో త్వరితగతిన చికిత్స అందించడం ప్రాణాలను కాపాడడంలో కీలకమని వైద్యులు తెలిపారు. యశోద ఆసుపత్రిలో ఉన్న అత్యాధునిక ఐసీయూ సదుపాయాలు, హై–ఎండ్ డయాలిసిస్ యంత్రాలు, అనుభవజ్ఞులైన వైద్యుల బృందం అత్యాధునిక సాంకేతికత, నిపుణులైన వైద్యుల బృందం అందుబాటులో



ఉండటం వల్లే ఇలాంటి క్లిష్టమైన కేసులకు విజయవంతంగా చికిత్స చేయగలుగుతున్నామని ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ శ్రీనివాస్ చిదుర తెలిపారు. సంక్లిష్ట కిడ్నీ వ్యాధులకు సురక్షితమైన వైద్యం అందించడంలో తమ ఆసుపత్రి ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని స్పష్టం చేశారు.

# తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి

● మిషన్ భగీరథలో అంతరాయం కలిగితే తక్షణ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ● సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం సమగ్ర జిల్లా కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరా, వేసవి యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాలో ఎక్కడైనా అంతరాయం కలిగితే వెంటనే స్థానిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు నీటి కొరతతో ఒత్తిడికి గురికాకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త గృహ కనెక్షన్లను గ్రామ పంచాయతీ నిధుల ద్వారా వేగంగా మంజూరు చేయాలని తెలిపారు. పైప్‌లైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేసి నీటి వృథా నివారించాలన్నారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల చిన్నపాటి మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ హౌసింగ్ పథకం పురోగతిని వేగవంతం చేయాలని, లబ్ధిదారులందరిని సంప్రదించి గృహ నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని తెలిపారు. నిర్మాణ పురోగతిని బట్టి బిల్లులు చెల్లించడంతో పాటు అవసరమైన



నమోదు వివరాలను సమయానుసారం నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ పూర్ణ చంద్రర్, ఇంట్రా ఈఈ శ్రీనివాస్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపీడీవోలు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# నేడు మెగా జాబ్ డ్రైవ్ నిర్వహణ: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

● సుమారు 68 సంస్థలలో 3439 ఉద్యోగ అవకాశాలు లభ్యం

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేందుకు జిల్లా పరిపాలన యంత్రాంగం, సంయుక్తంగా మే 6న పెద్దపల్లి పట్టణంలోని వెంకట పద్మావతి కన్వెన్షన్ హాల్, ఆర్టీవో కార్యాలయం ఎదురుగా, పెద్దపల్లిలో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌లో సుమారు 20 లోకల్ సంస్థలు మరియు 48 నాన్ లోకల్ సంస్థలు మొత్తం 68 సంస్థలు పాల్గొంటుండగా, సుమారు 3439 ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. జీతం 18,000/- నుండి మొదలై 80,000/- వరకు ఉంటుందని తెలిపారు. టెలికాం కమ్యూనికేషన్, కస్టమర్ సపోర్ట్ బిపిఓ, సేల్స్ మార్కెటింగ్, డిజిటల్ సర్వీసెస్, ఫీల్డ్ అసోసియేట్ వంటి వివిధ రంగాల్లో ఈ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జిల్లాలోని యువతను పెద్ద సంఖ్యలో అవకాశాలను వినియోగించు కోవాలని సూచించారు. వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. టాస్క్ మరియు ఐజుజు ద్వారా ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల ద్వారా యువత ఈ తరహా జాబ్ డ్రైవ్ ద్వారా ఉద్యోగాలు సాధించి మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసీ, ఇంజినీరింగ్, ఎంబీఏ తదితర అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. యువత ఈ మెగా జాబ్ డ్రైవ్‌ను ఒక మంచి అవకాశంగా తీసుకొని పెద్ద సంఖ్యలో హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లతో పాటు ఆధార్, ఐజుజు పోర్టల్‌లో నమోదు చేసుకుని హాజరు కావాలని తెలిపారు. జిల్లా యువత ఉపాధి పొందడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా, జిల్లా సమగ్ర అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ఈ మేరకు జిల్లా పరిధిలో యువతందరూ భారీగా పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



# పూటకో మాటచెప్పి రైతులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతుంది: మాజీ ఎమ్మెల్యే రసమయి

**ఇల్లంతకుంట, మే5(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కేషన్నపల్లి వద్ద బెజ్జంకి వెళ్ళే క్రమంలో మొక్కజొన్న రైతులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంగళవారం పలకరించారు. ఎకరాకు 26 క్వింటాళ్ల దిగుబడితో ప్రభుత్వం కొనుగోలు చేస్తుండగా మిగతావి దళారులకు అమ్ముకుని నష్టపోతూ పంటను అమ్మేందుకు అరిగోసలు పడుతున్నామని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ... నల్లరేగడి భూముల్లో చినుకు పడితేనే పత్తి సాగు చేసుకునే పరిస్థితి నుండి కేసీఆర్ పుణ్యమాని అనంతగిరి డ్యాం నీళ్ళతో వర్షాకాలౌ పత్తి,యాసంగిలో పొద్దుతిరుగుడు, మొక్కజొన్న సాగు చేస్తూ ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నామన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్మేందుకు ప్రభుత్వం పూటకో నిబంధన పెడుతుంటే, దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని రైతులు నష్టపోతున్నారని, రైతులను పీక్కుతినే ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎకరాకు 35 క్వింటాళ్ల చొప్పున మొక్కజొన్న కొనుగోలు చేయాలని రసమయి డిమాండ్ చేశారు.



# అరుణోదయ రామారావు వర్ధంతి సభ



**ఖమ్మం, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక సభ్యులు అమరుడు కామ్రేడ్ అరుణోదయ రామారావు ఏడవ వర్ధంతి సభను గుండాల మండలం రెడ్డిగూడెంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గుండాల మండల కార్యదర్శి చింత కోటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు మాట్లాడారు. రామ మారావు బ్రతికినంత కాలం పీడిత ప్రజల పక్షాన నిలబడి ప్రజా కళలను, సాహిత్యాన్ని అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించాడని, తన చివరి శ్వాస వరకు పేద ప్రజల పక్షానే గానం చేశాడని కొనియాడారు. తన పాటతో ఈ దోపిడీ పాలకవర్గాలను ప్రశ్నించాడని, ఈ క్రమంలోనే అనేక అక్రమ కేసులను జైలు నిర్బంధాలను చవిచూశాడని తెలిపారు. రామరావన్న ఆశయాల సాధన కోసం మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో నాయకులు కోరం సీతారాములు, సారన్న, పర్షిక రవి,యాసారపు వెంకన్న,గడ్డం లాలయ్య, తాటి రమేష్, చింత నరసన్న, నరసమ్మ,సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు పులిమామిడి గ్రామంలో అవగాహన కార్యక్రమం



**నల్గొండ, మే 05 (ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా అనుముల మండలం పులిమామిడి గ్రామపంచాయతీలో గ్రామ భద్రతను దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత అవసరమని హాలియా ఎస్సై. సాయి ప్రశాంత్ పేర్కొన్నారు. గ్రామంలో జరుగుతున్న చోరీలు, అనుమానాస్పద కదలికలు మరియు ఇతర అనర్థాలను నివారించడానికి సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా గ్రామంలో ప్రతి కదలికపై పర్యవేక్షణ సాధ్యమవుతుందని, నేరాలను తగ్గించడంలో ఇది సహాయకారిగా ఉంటుందని చెప్పారు. అందువల్ల గ్రామంలోని ప్రతి ఒక్కరూ కలిసి ముందుకు వచ్చి సహకారం అందించాలని, మన గ్రామాన్ని సురక్షితంగా మార్చుకోవాలని సూచించారు. గ్రామ భద్రత మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు.

# నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలి: రవికుమార్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మే 10వ తేదీన నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా చేపడుతున్న ప్రచార కార్యక్రమాల్లో భాగంగా వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా తెలంగాణకు విచ్చేస్తున్న నరేంద్ర మోడీ రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. దాదాపు రూ. 7,823 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ల అభివృద్ధి, జాతీయ రహదారుల విస్తరణ వంటి ప్రాజెక్టులతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందనున్నాయని, మల్కాపూర్ టెర్మినల్ ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. తెలంగాణ అభివృద్ధి కోసం వస్తున్న ప్రధానికి ఘన స్వాగతం పలకాలని, శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్, కాలనీ, బూత్ స్థాయిలో ప్రజలను ఆహ్వానిస్తూ వాల్ రైటింగ్స్, పోస్టర్లు, ఫ్లెక్సీలతో విస్తృత ప్రచారం చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మైపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు వసంతి యాదవ్, రామరాజు, కేశవులు, మని భూషణ్, నరేందర్ రెడ్డి, ఆంజనేయులు సాగర్, రమేష్, పద్మా, కాంచన కృష్ణ, జితేందర్, ఆకుల లక్ష్మణ్, అరుణ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**కరీంనగర్ టౌన్, మే5(ది క్రైమ్ న్యూస్):** సంక్షేమ శాఖ మంత్రి ముఖ్య అనుచరులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన మిత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నరేందర్ రెడ్డి కి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నరేందర్ రెడ్డి మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, ప్రజా సేవలో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు

## ● పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. మంగళవారం మాదాపూర్ డివిజన్ పరిధిలో హైటెక్ ఫుడ్ కోర్ట్ నుండి యశోద ఆసుపత్రి వరకు రూ. 74 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సర్వీస్ రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు, చెరువుల ఇన్‌లెట్లు, నాలాలను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సిఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ హైటెక్ సిటీ ఫ్లైఓవర్ నుండి యశోద ఆసుపత్రి ముందు ఫ్లైఓవర్ వరకు రోజువారీగా తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. వాహనదారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ. 74 లక్షలతో సర్వీస్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని, దీని ద్వారా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం, మెరుగైన జీవన ప్రమాణాల కోసం ఈ పనులు చేపడుతున్నామని, రద్దీ ప్రాంతాల్లో అన్ని సదుపాయాలతో రోడ్డు విస్తరణ జరగాలని, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణ వల్ల ట్రాఫిక్ తగ్గి సమయం, ఇంధనం ఆదా అవుతుందని, ప్రజలకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. మాదాపూర్ డివిజన్ అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలాల పూడిక తొలగించాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, చెరువుల ఇన్‌లెట్లను పరిశీలించి నీటి ప్రవాహం సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట వరద నీటి కాల్వలు నిర్మించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారి ఈఈ గోవర్ధన్, డీఈ దుర్గ ప్రసాద్, వర్క్ ఇన్స్పెక్టర్ శర్మ, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# నాలా విస్తరణ పనులను పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ధరణి నగర్ నాలా విస్తరణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మంగళవారం ఎస్ఎన్‌డీపీ ఇంజనీరింగ్ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. పరికి చెరువు అలుగు నుండి ప్రేమ్ సరోవర్ అపార్ట్‌మెంట్స్ వరకు రూ. 8 కోట్ల 76 లక్షల అంచనాతో చేపడుతున్న ఈ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా కొనసాగుతున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఈ నాలా విస్తరణ పనులు కీలకమని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను తిరిగి ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని, రాబోయే వర్షాకాలానికి ముందే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. నాలల విస్తరణతో లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభిస్తుందని, భవిష్యత్తులో వరద సమస్య మళ్లీ పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పనుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రవాణా సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని, నీటి ప్రవాహం సాఫీగా జరిగేలా సాంకేతిక ప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ ఇంజనీరింగ్ విభాగం ఉప ఇంజనీర్ ధీరజ్, సహాయ ఇంజనీర్ అరుణ్, స్థానిక నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్, జిల్లా గణేష్, కాశినాథ్ యాదవ్, శివరాజ్ గౌడ్, రాజేష్, సంతోష్, శ్రీధర్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వయసు పెరిగినా యవ్వనంగా కనిపించాలంటే..
# ఈ పండ్లు తినండి! ఏంజెల్స్‌లా మెరిసిపోతారు



ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ యవ్వనంగా, అందంగా కనిపించాలని కోరుకుంటారు. దీని కోసం అనేక రకాల చికిత్సలు కూడా తీసుకుంటూ ఉంటారు. బ్యూటీ పార్లర్లలలో రకరకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులను వినియోగిస్తుంటారు. కానీ ప్రతీసారి ఆశించిన ఫలితాలు అందకపోవచ్చు. నిజానికి, చర్మం యవ్వనంగా కనిపించాలంటే కొన్ని ఆహారాలను డైట్‌లో చేర్చుకోవాలి. అలాగే చెడు జీవనశైలి కారణంగా కూడా చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ఏది ఏమైనప్పటికీ, వేసవి కాలంలో సూర్యుని కిరణాల కారణంగా చర్మం దెబ్బతింటుంది. అటువంటి పరిస్థితిలో చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఆహారపు అలవాట్లు సరిగా లేకపోవడం వల్ల అతి చిన్న వయసులోనే వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖంపై, ముడతలు, మచ్చలు కనిపించడం ప్రారంభిస్తాయి. చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే ఏయే ఆహారాలు తీసుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.. బెర్రీ పండ్లు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు బెర్రీలలో పుష్కలంగా లభిస్తాయి. స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, బ్లాక్బెర్రీస్ తినడం వల్ల చర్మం యవ్వనంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలో వేగవంతమైన మార్పులను నెమ్మదించేలా చేస్తాయి. దీనితో పాటు బెర్రీలు ఆక్సీకరణ ఒత్తిడిని తొలగించడంలో కూడా సహాయపడతాయి. డ్రై ఫ్రూట్స్ బాదం, వాల్‌నట్, జీడిపప్పు, వాల్‌నట్, గుమ్మడికాయ గింజలు వంటి డ్రై ఫ్రూట్స్ చర్మానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. చర్మానికి మేలు చేసే డ్రై ఫ్రూట్స్ రోజూ తినడం వల్ల ఇందులో ఉండే విటమిన్-ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా చర్మానికి అందుతాయి. కొవ్వు చేప నాన్ వెజ్ ఫుడ్ ఇష్టపడే వారు చర్మాన్ని కాపాడుకోవడానికి ఫ్యాటీ ఫిష్ ను తమ డైట్ లో చేర్చుకోవచ్చు. చర్మంపై కనిపించే వృద్ధాప్య సంకేతాలను నివారించడంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కొవ్వు చేపలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో సహాయపడతాయి. వీటితోపాటు గ్రీన్ టీ ద్వారా కూడా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. గ్రీన్ టీని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల చర్మ కణాలు ఆరోగ్యంగా ఉంటాయి.

# అధిక రక్తపోటు ఎంత ప్రమాదమో తెలుసా?
# నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదంటున్న నిపుణులు



హైపర్ టెన్షన్ కూడా ఓ విధమైన సైలెంట్ కిల్లర్. అధిక రక్తపోటు ప్రాణాలను నెమ్మదిగా హరిస్తుంది. మీకూ అధిక రక్తపోటు సమస్య ఉంటే ప్రతిరోజూ తప్పకుండా మెడిసిన్ తీసుకోవాలి. అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలు వస్తాయి. అసలు అధిక రక్తపోటు ఎందుకు దాడి చేస్తుంది? ఈ సమస్యను ఎలా నియంత్రించవచ్చు వంటి వివరాలు నిపుణుల మాటల్లో తెలుసుకుందాం. బిర్లా హార్ట్ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సబ్యసాచి పాల్ మాట్లాడుతూ.. రక్తపోటు వెనుక అనేక జీవనశైలి కారకాలను వివరించారు. వీటిలో వ్యాయామం నుంచి ఊబకాయం, ధూమపానం వరకు అనేక కారకాలు ఉన్నాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుందని డాక్టర్ సబ్యసాచి పాల్ అంటున్నారు. కానీ రోజువారీ ఏరోబిక్ వ్యాయామం రక్తపోటును పెంచుతుంది. ముఖ్యంగా రక్తపోటు అదుపులో లేని వారు, శరీర బరువు పెరిగినవారికి, ఊబకాయంతో బాధపడుతున్నవారికి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. ఊబకాయం కారణంగా అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా తరచుగా సంభవిస్తుంది. ఇది రక్తపోటు ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. ప్రిజర్వేటివ్స్, చక్కెర, ఉప్పుతో కూడిన ప్రాసెస్ చేసిన ఆహారాలు రక్తపోటుకు కారణమని డాక్టర్ సబ్యసాచి పాల్ చెబుతున్నారు. ఇందులో అధిక మొత్తంలో కేలరీలు, సోడియం ఉంటుంది. ఇవి అధిక రక్తపోటుతో పాటు కిడ్నీ సమస్యలు, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతాయి. అధిక రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి ఫాస్ట్ ఫుడ్ మానుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని డాక్టర్ పాల్ సూచిస్తున్నారు. జీవనశైలి కారకాలు మాత్రమేకాకుండా, రక్తపోటుకు మరొక కారకం కూడా ఉంది. అధిక రక్తపోటుకు ఒత్తిడి కూడా కారణం. ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. మీరు హైపర్‌టెన్షన్ రోగి అయితే, ప్రతిరోజూ తప్పనిసరిగా మందులు వాడాల్సి ఉంటుంది. బిఎమ్ బిర్లా హార్ట్ హాస్పిటల్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ అంజన్ సియోటియా ఈ విషయాన్ని సూచిస్తున్నారు. చాలా మంది హైపర్ టెన్షన్ కు చికిత్స తీసుకోరని డాక్టర్ అంజన్ అంటున్నారు. సగం కంటే ఎక్కువ మందికి తమకు అధిక రక్తపోటు ఉందనే విషయమే తెలియదు. ఎందుకంటే వారు ఎప్పుడూ రక్తపోటును క్రమం తప్పకుండా టెస్ట్ చేయించుకోరు. అలాగే దీనిపై అవగాహన ఉన్న రోగులలో కూడా సగం మంది రోగులు రోజూ మందులు తీసుకోరు. ఈ కారణంగా మరణాల సంఖ్య పెరుగుతుంది. చికిత్స చేయకపోతే సమస్య మరింత తీవ్రతరం అవుతుంది. దీంతో పక్షవాతం, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి తరచుగా రక్తపోటు పరీక్షించుకోవాలి. అలాగే మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. ఇలాచేస్తే రక్తపోటును నియంత్రించడం సులభతరం అవుతుంది.

# ఘనంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

- విస్తృతంగా వివిధ ప్రాంతాలలో ఘనంగా కేక్ కటింగ్ లు సేవా కార్యక్రమాలు





**కరీంనగర్ టౌన్, మే5(ది క్రైమ్ న్యూస్):** సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు కరీంనగర్ నియోజకవర్గంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున కేక్ కటింగులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.నగరంలోని ఇందిరా చౌక్ లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.పలు ప్రాంతాల్లోని వాకర్స్ అసోసియేషన్లు పలు డివిజన్లలోని నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. భగత్ నగర్ లోని అయ్యప్ప గుడి లో హనుమాన్ దీక్ష స్వాములకు భిక్ష కార్యక్రమం చేపట్టారు. సివిల్ ఆసుపత్రిలో, వృద్ధాశ్రమంలో మాతా శిశు ఆసుపత్రిలో అల్పాహారం మరియు పండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నాఖా చౌరస్తా లో క్రేన్ సహాయంతో నరేందర్ రెడ్డి ని గజ మాలతో సన్మానించి పెద్ద ఎత్తున సంబరాలు జరిపారు. కరీంనగర్ రూరల్ మండలం మరియు కొత్తపల్లి మండలం లోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ మహిళలతో కలిసి ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలు పర్వతం మల్లేశం, బోట్ల శ్యామల, కిరణ్, తాజుద్దీన్, మడుపు మోహన్, కల్లేపల్లి బాలరాజు, ఖాదర్ షా, కొరివి అరుణ్ కుమార్, పెద్దిగారి తిరుపతి, కాంపెల్లి కీర్తి కుమార్, జక్కుల మల్లేశం, చాంద్, ఎట్టేపు వేణు, గుడిపాటి రమణ రెడ్డి, అస్తపురం రమేష్, పిట్టల రవి,షైనషా ,రంగా నాయక్, మీరజ్, అశ్రఫ్, చెర్ల పద్మ, యనమల మంజుల, షబానా, ముల్కలా కవిత, అస్తపురం తిరుమల, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మిక్స్డ్ నెట్ బాల్ టోర్నీ పోస్టర్స్‌ను విడుదల చేసిన అడిషనల్ డిసిపి జోగుల నర్సయ్య




**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** జాతీయ మిక్స్డ్ నెట్ బాల్ ఫెడరేషన్ కప్ ఛాంపియన్ షిప్ పోటీల పోస్టర్స్ ను మంగళవారం అంబర్ పేట్ అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8 ,9, 10వ తేదీల్లో జాతీయ పోటీలు గౌలిపూరా లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరుగుతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా 8 జట్లు చెందిన 200 మంది క్రీడాకారుణి, క్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మిక్స్ నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ .సోమేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి ఎం. సమ్మయ్య, చైర్మన్ డాక్టర్ ఎ. బాలరాజ్ ,రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి. లక్ష్మయ్య, అంతర్జాతీయ నెట్ బాల్ ఆటగాడు ఎస్.బాల రాజ్ పాల్గొన్నారు.

## ఘనంగా రాజేష్ గౌడ్ జన్మది వేడుకలు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మక్త మహబూబ్‌పేట్ డివిజన్‌కు చెందిన బిజెపి నాయకుడు పులిపలుపుల రాజేష్ గౌడ్ తన 45వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం అశోక గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ రాజేష్ గౌడ్ ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే నాయకుడని కొనియాడారు. రాజకీయంగా మాత్రమే కాకుండా సామాజిక సేవలో కూడా ఆయన చేస్తున్న కృషి అభినందనీయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. రాజేష్ గౌడ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని, ఆర్థికంగా, రాజకీయంగా మరింత అభివృద్ధి సాధించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజేష్ గౌడ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, యువజన విభాగం సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొని రాజేష్ గౌడ్ సేవలను కొనియాడారు.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇది తాగితే

# ఆ సమస్యలన్నీ మటాష్



రోజూ మన డైట్‌లో అల్లం భాగం చేసుకోవడం వల్ల ఎన్నో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అల్లం మీ టీతో పాటు ఆహారం రుచిని పెంచుతుంది. అయితే మీరు ఎప్పుడైనా అల్లం నీళ్లు తాగారా? ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్య ప్రయోజనాలను పొందడానికి అల్లం నీరు తాగడం సులభమైన మార్గం. ఆయుర్వేదంలో అల్లం ఔషధ గుణాలకు ప్రసిద్ధి. పురాతన వైద్యంలో అల్లం అనేక వ్యాధులను నయం చేయడానికి ఒక మూలికగా ఉపయోగించారన్న విషయం తెలిసిందే కదా..! అల్లంలో శరీరానికి అవసరమైన విటమిన్ సి, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, జింక్, కాపర్, మాంగనీస్, క్రోమియం వంటి పోషకాలు ఉన్నాయి. ముఖ్యంగా



ఉదయాన్నే ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగితే అల్లం వల్ల కలిగే ప్రయోజనాలన్నీ శరీరానికి అందుతాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం 1. బరువు తగ్గుతారు ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగడం వల్ల జీవక్రియ వేగవంతం అవుతుంది. ఇది కొవ్వును వేగంగా కరిగించడంలో సహాయపడుతుంది. మీ శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడానికి ఉపయోగపడుతుంది 2. షుగర్ బాధితులకు ప్రయోజనకరం: ఖాళీ కడుపుతో అల్లం నీరు తాగితే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అలాగే, రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా ఉంటుంది. ఇది మధుమేహం వల్ల వచ్చే సమస్యల నుండి బయటపడటానికి సహాయపడుతుంది. 3. చర్మానికి మేలు చేస్తుంది: అల్లం నీరు శరీరంలో పేరుకుపోయిన మురికి, టాక్సిన్స్ ను తొలగించడంలో సహాయపడుతుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. చర్మంపై దద్దుర్లు, మొటిమలు, ముడతలు వంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది మీ రక్తాన్ని సహజంగా శుద్ధి చేయడంలో యూజ్ అవుతుంది 4. ఇన్‌ఫ్లమేటరీ సమస్యలు దూరం : అల్లం శరీరంలోని ఇన్‌ఫ్లమేటరీ సమస్యలను దూరం చేయడంలో సహాయపడుతుంది. అల్లం వాపును కలిగించే సూక్ష్మజీవులు, హానికరమైన బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడుతుంది. 5. పొట్టకు మేలు చేస్తుంది: ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. దీని కారణంగా, అజీర్ణం, మలబద్ధకం, ఉబ్బరం, వాంతులు, విరేచనాలు, వికారం వంటి సమస్యలను తొలగించడంలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుంది. అదనంగా, అల్లం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. దీని వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించి గుండె ఆరోగ్యంగా ఉంచుతుంది.

## ఇదేం చేస్తుందిలే అని చీప్‌గా చూడకండి..

### ఆ సమస్యలకు పవర్‌ఫుల్ వెపన్.. డైలీ జ్యూస్ తాగితే..



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. అందుకే ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి జీవనశైలిని అవలంభించాలని.. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే.. ఆరోగ్యానికి మేలు చేసే దుంపల్లో బీట్‌రూట్ ఒకటి.. బీట్‌రూట్ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. వాస్తవానికి బీట్ రూట్‌ను సలాడ్‌గా తీసుకుంటారు. కొందరు బీట్ రూట్ మామూలుగా తింటే.. మరికొందరు జ్యూస్ చేసుకుని తాగుతారు. బీట్‌రూట్‌లో ఐరన్, సోడియం, సెలీనియం, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరం అనేక వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది.. రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉండటమే కాకుండా కొవ్వు మొదలైన వాటిని తగ్గించడంలో సహాయపడుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అందుకే బీట్ రూట్ ను తప్పనిసరిగా తీసుకోవాలంటున్నారు. బీట్ రూట్ రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకోండి.. బ్లడ్ ప్రెజర్ కంట్రోల్: బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇందులో నైట్రేట్ ఉండటం వల్ల శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి సహాయపడుతుంది. బరువు నియంత్రణ: బీట్‌రూట్ రసంలో కొవ్వు, కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. ఉదయాన్నే దీన్ని తాగడం వల్ల రోజంతా శరీరానికి శక్తి లభిస్తుంది. కాలేయానికి మేలు చేస్తుంది: బీట్‌రూట్‌లోని బీటైన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కాలేయంలో కొవ్వు ఆమ్లాలు పేరుకుపోకుండా చేస్తుంది. ఇది కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది: బీట్‌రూట్‌లో పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. ఇది శరీరంలోని కండరాలు, నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. గుండెకు మేలు చేస్తుంది: బీట్‌రూట్ రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే శరీరంలో ప్లాస్మా నైట్రేట్ స్థాయిలను పెంచుతుంది. ఇది శరీరం స్టామినాను పెంచుతుంది. క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది: బీట్‌రూట్ రసంలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది క్యాన్సర్ ప్రమాదం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది.



## వామ్మో.. రక్తహీనతతో బాధపడుతున్నారా..? డేంజర్ జోన్ నుంచి బయటపడాలంటే ఇలా చేయండి



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కొవలసి వస్తోంది.. ముఖ్యంగా పేలవమైన జీవనశైలి, అనారోగ్యమైన ఆహారం.. పని ఒత్తిడి.. ఇవన్నీ రోగాల బారిన పడేలా చేస్తున్నాయి. శరీరానికి కావలసిన పోషకాలు, విటమిన్లు అందకపోతే.. ప్రమాదంలో పడినట్లే.. అందుకే.. తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలంటున్నారు వైద్య నిపుణులు.. అయితే, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, మీ శరీరంలో తగినంత ఐరన్ ఉండటం చాలా ముఖ్యం. ఇనుము లోపం మీ ఆరోగ్యాన్ని తీవ్రంగా పాడు చేస్తుంది. శరీరంలో విటమిన్లు పుష్కలంగా ఉండటానికి కొన్ని ఆహారాలను తీసుకోవాలి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకోండి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఇవి తినండి.. దానిమ్మ: శరీరంలో విటమిన్లు, ఖనిజాలు ఉండటం చాలా ముఖ్యం. వీటి లోపం వల్ల అనేక వ్యాధులను ఎదుర్కోవాల్సి వస్తుంది. శరీరంలో ఐరన్ లోపం వల్ల అనేక రకాల సమస్యలు వస్తాయి. శరీరంలో ఐరన్ తక్కువగా ఉన్నప్పుడు, చాలా బలహీనత ఉంటుంది. ఐరన్ లోపం ఉన్నవారు ఆహారంలో దానిమ్మను చేర్చుకుంటే చాలా మంచిది.. దీనివల్ల రక్తహీనత సమస్య నుంచి బయటపడొచ్చు.. గుడ్డు: ఐరన్ లోపం ఉన్నవారు ఉదయం అల్పాహారంగా కూడా గుడ్లు తీసుకోవాలి. గుడ్లలో మంచి మొత్తంలో ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, ఐరన్ ఉంటాయి. దీని వల్ల శరీరంలో ఐరన్ లోపం ఏర్పడదు.. గుడ్లలో విటమిన్ డి కూడా లభిస్తుంది. ఐరన్ లోపం ఉన్నవారు తప్పనిసరిగా గుడ్లు తినాలి. రెగ్యులర్ గా మీ ఆహారంలో ఒక గుడ్డును చేర్చుకోండి.. బీట్‌రూట్: రోజూ బీట్‌రూట్ తీసుకోవడం వల్ల మీ శరీరంలోని రక్తహీనత తొలగిపోతుంది. ఇనుము లోపం నయమైతే, అనేక వ్యాధులు కూడా నయమవుతాయి. రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగితే శరీరంలో ఐరన్ లోపాన్ని నివారించవచ్చు.. బీట్‌రూట్ తినడం వల్ల హిమోగ్లోబిన్ పెరుగుతుంది. ఇది మీ కడుపులో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో కూడా చాలా సహాయపడుతుంది. పాలకూర: పాలకూరలో కూడా ఐరన్ పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ మీ ఆహారంలో చేర్చుకోవడం చాలా మంచిది. పాలకూరలో కాల్షియం, సోడియం, ఖనిజ లవణాలు, క్లోరిన్, ఫాస్పరస్, అనేక ఇతర ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇవి మీ శరీరాన్ని ఇనుము లోపం నుంచి దూరంగా ఉంచుతాయి. ఇంకా ఒత్తిడిని తగ్గించడం ద్వారా మీ శరీరాన్ని రిలాక్స్ చేయడంలో కూడా ఇవి సహాయపడతాయి. పండ్లు కూరగాయలు: తాజా పండ్లు, కూరగాయలు మీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. తాజా, పండ్లు కూరగాయల్లో ఐరన్ ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. కావున వీటిని ప్రతిరోజూ తింటే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు..

## గుడ్లలో కంటే ఎక్కువ ప్రోటీన్ కావాలా..? అయితే ఈ పప్పులను తినండి.. ఇక నో టెన్షన్..



శరీరాన్ని ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచుకోవడానికి విటమిన్లు, మినరల్స్‌తో పాటు ప్రొటీన్లు కూడా చాలా అవసరం. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ప్రోటీన్ సహాయపడుతుంది. అయితే, శరీర అభివృద్ధి నుంచి రోగనిరోధక శక్తిని పెంచడానికి ప్రోటీన్ తోపాటు విటమిన్లు చాలా సహాయపడతాయి. ప్రోటీన్ మూలాలలో ఒకటి గుడ్లు.. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ రోజుకు కనీసం 1 గుడ్డు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే, తృణధాన్యాల్లో (పప్పులు) గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయి. అయితే, చాలామంది గుడ్లు తినరు లేదా మాంసాహారం తీసుకోరు.. అలాంటి వారికి ప్రొటిన్ లోపం ఉంటుంది.. అలాంటి వారు శరీరంలో ప్రోటీన్ స్థాయిలను నిర్వహించడానికి వారు పప్పులను తినవచ్చు. కొన్ని పప్పుల్లో గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. పప్పులలో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. దీనిని అన్నం లేదా రొట్టెలతో తినవచ్చు. పప్పు చాలా మందికి సులభంగా జీర్ణం కాదు. అలాంటప్పుడు పప్పు చారు తినడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పప్పు ఆరోగ్యానికి చాలా మంచిది. కందిపప్పు, మసూర్ పప్పు, పెసర పప్పులో గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయని చెబుతున్నారు. కాబట్టి తల్లులు, అమ్మమ్మలు ఉపవాసం ఉన్నప్పుడు, శనగపప్పు ఉడకబెట్టి తింటారు. తద్వారా శరీరంలో ప్రోటీన్ లోపం ఉండదు. ముఖ్యంగా పెసర పప్పు కూడా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. కాబట్టి డైట్‌లో ఉన్నవారు కూడా పెసరపప్పు తింటే ప్రొటీన్ లెవెల్స్ అదుపులో ఉంటాయి జిమ్, యోగా లేదా ఇతర శారీరక శ్రమలలో పాల్గొనే వారికి పెసరపప్పు, కందిపప్పు, శనగల మొలకలు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఎందుకంటే ఇందులో అధిక ప్రొటీన్‌తో పాటు క్యాల్షియం, ఐరన్ తగినంత మొత్తంలో ఉంటాయి. ఇంకా వీటిని కూరగా లేదా.. ఉడకబెట్టుకుని కూడా తినవచ్చు.. అందుకే డైలీ ఒక కప్పు పప్పును తింటే శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## రొమాన్స్ పండు.. ఉదయాన్నే పరగడుపున తింటే ఆ సమస్యలకు చెక్ పెట్టినట్లే.. ట్రై చేయండి..



ప్రస్తుత కాలంలో ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. కావున ఆరోగ్యంపై దృష్టిసారించడం మంచిది.. అందుకే ఆరోగ్యానికి మేలు చేసే పండ్లను తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి పండ్లలో కర్బూజ ఒకటి.. దీనిలోని పోషకాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. కర్బూజ పండులో నీటిశాతం ఎక్కువ.. కావున దీన్ని తినడం ద్వారా హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. అయితే, ప్రతి రోజూ ఉదయాన్నే కర్బూజ తినడం వల్ల చాలా వ్యాధులకు చెక్ పెట్టవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.. ముఖ్యంగా వేసవి కాలంలో కర్బూజను తినడం వల్ల అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. శరీరంలో నీటి కొరతను, పోషకాల కొరతను నివారించాలంటే దీనిని తప్పనిసరిగా తినాలి.. ముఖ్యంగా పరగడుపున (ఖాళీ కడుపుతో) తింటే చాలా మేలు జరుగుతుంది. కర్బూజ ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. కర్బూజను తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. గుండె సంబంధిత వ్యాధుల నుంచి ఉపశమనం: కర్బూజను రోజూ తీసుకుంటే గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. దీనిలో ఫోలిక్ యాసిడ్ ఉంటుంద. ఇది మీ రక్తాన్ని శుద్ధి చేయడంలో కూడా సహాయపడుతుంది. రక్త నాళాలలో రక్తం గడ్డకట్టడాన్ని నివారించడంలో ఇది మీకు చాలా సహాయపడుతుంది. దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే చాలా ప్రయోజనాలను పొందవచ్చు. కడుపు సమస్యలు దూరం: వేసవి కాలంలో ప్రజలకు కడుపు సంబంధిత సమస్యలు మొదలవుతాయి. అజీర్తి, మలబద్ధకం, కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతుంటారు. అయితే, ఈ సీజన్‌లో ఎక్కువ నూనె, మసాలాలు తీసుకోవడం చాలా ప్రమాదకరం. కావున, అలాంటివి తగ్గించి.. తేలికపాటి వస్తువులను అంటే సులభంగా జీర్ణమయ్యే వాటిని తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కావున కర్బూజను తినడం చాలా మంచిది. కంటి సంబంధిత సమస్యలు: కర్బూజ తినడం వల్ల కంటి సంబంధిత సమస్యలు కూడా నయమవుతాయి. విటమిన్ ఎ బీటా కెరోటిన్ కర్బూజలో లభిస్తుంది. ఇది మీ కంటి చూపును మెరుగుపర్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇంకా కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా మీకు చాలా సహాయపడుతుంది. లైంగిక సమస్యల నుంచి ఉపశమనం: కర్బూజలోని విటమిన్ కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి. దీని వలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. దీనిని తినడం వల్ల లైంగిక సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు: కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.. వాటి నుంచి బయటపడేందుకు నిత్యం పలు రకాల మందులు వాడుతుంటారు. అలాంటి వారు రోజూ పుచ్చకాయను తీసుకుంటే.. కిడ్నీల్లో రాళ్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు..

## ఒక్కటి.. ఒకే ఒక్కటి.. పడుకునే ముందు అరటిపండు తింటే ఏమవుతుందో తెలుసా..? అమేజింగ్ అంతే..

అరటిపండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే.. ఎప్పటికీ అందుబాటులో ఉండే అరటిపండును తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి6, ఫైబర్, మాంగనీస్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. అందుకే.. ఆరోగ్యానికి మేలు చేసే అరటిపండును తింటే.. శరీరానికి అనేక ప్రయోజనాలను కలుగుతాయని పేర్కొంటున్నారు.. అయితే, పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల నిద్ర, జీర్ణక్రియతోపాటు మొత్తం ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుంది. నిద్రపోయే ముందు అరటిపండును తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది: అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఇది సెరోటోనిన్‌గా.. మెలటోనిన్‌గా మారుతుంది. ఇవి నిద్రను నియంత్రించడంలో సహాయపడే న్యూరోట్రాన్స్‌మిటర్‌లు. కండరాల సడలింపు: అరటిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం కూడా ఉన్నాయి. ఇవి కండరాలను సడలించే లక్షణాలకు ప్రసిద్ధి చెందిన ఖనిజాలను కలిగి ఉంటాయి. పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి, మరింత ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: అరటిపండ్లు మితమైన గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి. అంటే అవి నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. పడుకునే ముందు ఒకటి తినడం వల్ల రాత్రంతా రక్తంలో చక్కెర స్థాయిలలో వచ్చే అవాంతరాలను నివారించవచ్చు. ఆకలి బాధను నివారిస్తుంది:అరటిపండ్లు ఫైబర్ కు మంచి మూలం.పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల రాత్రి సమయంలో ఆకలి బాధలను నివారిస్తుంది. నిరంతరాయంగా నిద్రపోయేలా చేస్తుంది. పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.. అరటిపండ్లు విటమిన్లు సి, బి6, పొటాషియం, మాంగనీస్ వంటి అవసరమైన పోషకాలతో నిండి ఉన్నాయి.పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ శరీరానికి ఈ పోషకాలు అందుతాయి. ఇది మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

## విశ్వజి

# కాఫీలో నెయ్యి కలిపి రోజూ తాగితే ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయా..?



రోజూ ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు చాలా మంది టీ, కాఫీలను అధికంగా సేవిస్తుంటారు. అయితే కొందరు టీ ప్రియులు ఉంటే కొందరు కాఫీ ప్రియులు ఉంటారు. కాఫీలో చాలా మంది బ్లాక్ కాఫీ కూడా సేవిస్తుంటారు. అయితే బ్లాక్ కాఫీలో కాస్త నెయ్యి కలిపి తాగితే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇలా కాఫీలో నెయ్యి కలిపితే దాన్ని బుల్లెట్ ప్రూఫ్ కాఫీ అని కూడా పిలుస్తారు. ఈ కాఫీ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అనేక పోషకాలు కూడా ఈ కాఫీలో ఉంటాయి. కాఫీలో నెయ్యి కలిపి సేవించడం వల్ల శరీరానికి శక్తి నిరంతరం అందుతూనే ఉంటుంది. దీంతో రోజంతా శక్తి స్థాయిలు అలాగే ఉంటాయి. ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. సాయంత్రం అయ్యే సరికి వచ్చే నీరసం, అలసట ఉండవు. బరువు తగ్గేందుకు.. బుల్లెట్ ప్రూఫ్ కాఫీని సేవించడం వల్ల ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. కడుపు నిండిన భావనతో ఉంటారు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధికంగా బరువు ఉన్నవారు ఈ కాఫీని రోజూ తాగుతుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. బుల్లెట్ ప్రూఫ్ కాఫీని సేవించడం వల్ల జీర్ణ శక్తి మెరుగు పడుతుంది. జీర్ణాశయంలో ఆమ్లాలు అధికంగా ఉత్పత్తి కాకుండా అడ్డుకోవచ్చు. దీంతో అసిడిటీ తగ్గిపోతుంది. గుండెల్లో మంట నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఈ కాఫీని సేవిస్తే మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా మారుతారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మానసికంగా నిరంతరాయంగా అప్రమత్తంగా ఉంటారు. పోషకాల శోషణకు.. ఈ కాఫీని తాగితే శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అధిక బరువు సమస్య ఉన్నవారు రోజూ బుల్లెట్ ప్రూఫ్ కాఫీని తాగుతుంటే ప్రయోజనం ఉంటుంది. అయితే ఇందులో చక్కెర కలపకుండా తాగాల్సి ఉంటుంది. ఈ కాఫీని తాగడం వల్ల మనం తినే ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. ముఖ్యంగా నెయ్యిలో ఉండే విటమిన్లు ఎ, డి, ఇ, కెలను శరీరం శోషించుకుంటుంది. దీంతో మనకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుంది. విటమిన్ ఎ వల్ల కంటి చూపు మెరుగు పడుతుంది. విటమిన్ డి రోగ నిరోధక శక్తిని మెరుగు పరిచి ఎముకలను బలంగా మారుస్తుంది. చర్మ సంరక్షణకు.. నెయ్యిలో ఉండే విటమిన్ ఇ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మం ముడతలు పడకుండా చూస్తుంది. దీంతో చర్మానికి సహజసిద్ధమైన నిగారింపు వస్తుంది. ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. నెయ్యిలో ఉండే విటమిన్ కె ఎముకలను బలంగా మార్చడంతోపాటు గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డకట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్త స్రావం తగ్గుతుంది. ఇలా కాఫీలో నెయ్యి కలిపి తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే కొందరికి ఈ కాంబినేషన్ పడకపోవచ్చు. ఇది అలర్జీలను కలిగించే అవకాశం ఉంటుంది. కనుక ఫుడ్ అలర్జీలు ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు ఈ మిశ్రమాన్ని తీసుకోవాల్సి ఉంటుంది.



## మోకాలి నొప్పి వేధిస్తుందా? అయితే ఈ నివారణలు ట్రై చెయ్యండి

మోకాళ్ళ నొప్పి భారతదేశంలో అనేక మంది మోకాళ్ల నొప్పితో బాధ పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. మోకాళ్ళ నొప్పి నివారణకు చాలామంది సాంప్రదాయ చికిత్సలపై ఆధారపడతారు. ఈ సహజ పద్ధతులు చాలా కాలంగా చాలామంది పాటిస్తున్నారు. ఔషధాల అవసరం లేకుండా కొన్ని సహజ పద్ధతులు ఉపశమనం అందిస్తాయి. పసుపు మరియు అల్లం మోకాలి నొప్పికి కొన్ని సహజ నివారణలలో భాగంగా పసుపు మరియు అల్లం ఉపయోగిస్తున్నారు. పసుపు మరియు అల్లం వాటి వ్యాధినిరోధక లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. పసుపులో కర్కుమిన్ ఉంటుంది, ఇది వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. పసుపు మరియు అల్లం రెండూ నొప్పిని తగ్గించడానికి ప్రసిద్ధి చెందింది. వీటిని టీ రూపంలో తీసుకోవటం మోకాలి నొప్పిని తగ్గిస్తుంది. ఆవాల నూనెతో మసాజ్ వేడి ఆవాల నూనెతో మోకాళ్లను మసాజ్ చేయడం వలన కూడా మోకాలి నొప్పి తగ్గుతుంది. ఆవాల నూనె రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది మరియు మోకాలు కీళ్ళు గట్టిపడటాన్ని తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా మసాజ్ చేయడం అసౌకర్యం నుండి గణనీయమైన ఉపశమనాన్ని అందిస్తుంది. నీలగిరి నూనె, మెంతులు మోకాళ్ల నొప్పికి ఉపయోగించే మరో చికిత్స నీలగిరి నూనె. నీలగిరి నూనె యొక్క చల్లని ప్రభావం ప్రభావిత ప్రాంతాన్ని శాంతింపజేస్తుంది. నీలగిరి నూనె రాసుకోవడం నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది.మోకాలి నొప్పిని తగ్గించటానికి మెంతులు ఉపయోగపడతాయి. మెంతుల గింజలు వ్యాధినిరోధక ప్రభావాలను కలిగి ఉన్నాయని చెప్తారు. వాటిని రాత్రిపూట నానబెట్టి ఉదయాన్నే తీసుకోవడం కాలక్రమేణా మోకాళ్ల నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. యోగ మరియు వ్యాయామం సాధారణ వ్యాయామాలు మరియు యోగ మోకాలి చుట్టూ ఉన్న కండరాలను బలపరుస్తాయి. వారియర్ పోజ్ వంటి ఆసనాలు కూడా మోకాలి సౌలభ్యాన్ని మెరుగుపరుస్తాయి. నొప్పిని తగ్గిస్తాయి. ఈ సాంప్రదాయ పద్ధతులు భారతదేశంలో సహజంగా మోకాళ్ల నొప్పిని నిర్వహించడానికి ఉపయోగపడతాయి. అవి సంప్రదాయ చికిత్సలకు ప్రత్యామ్నాయం అందిస్తాయి. మోకాలి నొప్పి నుండి కాస్త ఉపశమనం కలిగిస్తాయి.

## లో బీపీ" లక్షణాలు.. ఎప్పుడు ప్రమాదం - వెంటనే ఏం చేయాలి..!!

రక్తపోటు. అధికంగా ఉన్నా.. లో బీపీ వచ్చినా సమస్యలు తప్పవు. బీపీ బాధితుల సమస్య ప్రస్తుత కాలంలో బాగా పెరుగుతున్నారు. హైబీపీ కారణంగా వచ్చే ముప్పు గురించి చాలా మందికి అవగా హన ఉంది. అయితే, లో బీపీని నిర్లక్ష్యం చేయకూడదు. ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. కాగా, లో బీపీ లక్షణాలు ఏంటి.. ఏ పరిస్థితుల్లో ప్రమాద కరం.. వెంటనే ఏం చేయాలనే దాని పైన వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు. లో బీపీ ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. శరీరంలో రక్త ప్రసరణ సరిగా జరగకపోవడాన్ని సూచి స్తుంది. సాధారణంగా ఆరోగ్యంగా ఉండే వ్యక్తుల్లో రక్తపోటు అనేది 120/80 %ఎఎన్త్ర% ఉండాలని, 90/60 %ఎఎన్త్ర% లేదా అంతకంటే తక్కువగా ఉన్నప్పుడు దానిని లో బీపీగా భావిస్తారు. లో బీపీ కారణంగా తల తిరగడం, మూర్ఛపోవడం, అలసట, నీరసం, వికారం, వాంతులు, గుండె వేగంగా కొట్టుకోవడం, ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చర్మం పాలిపోవడం, మూత్రపిండాల సమస్యలు, మసక దృష్టి వంటివి ఉంటాయి. ఇవి కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. లో బీపీ ఉన్నప్పుడు రక్తపోటును సాధారణ స్థాయికి తీసుకురావడానికి ఎండుద్రాక్షలను రాత్రంతా నానబెట్టి, మరుసటి రోజు ఉదయం నీటితో కలిపి తీసుకుంటే మంచిదని చెబుతారు. బీట్‌రూట్ రసం లేదా కూరగా తీసుకున్న మంచి ఫలితం ఉంటుంది. రాత్రిపూట నానబెట్టిన బాదం పప్పులను ఉదయం మెత్తగా చేసి, పాలతో కలిపి తాగడం వల్ల బీపీ నార్మల్ స్థితి?కి వచ్చే అవకాశం ఉంటుంది.

# ఇవి తింటున్నారా? మీ కిడ్నీలు జాగ్రత్త!



మన శరీరంలో ముఖ్యమైన అవయవాలు కిడ్నీలు. అటువంటి కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటేనే మనం ఏ పనైనా చేయగలుగుతాం. కిడ్నీల ఆరోగ్యం పైన ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇక కిడ్నీల ఆరోగ్యం కోసం ఏం తినాలి? ఏం తినకూడదు? అనేది కూడా ప్రతి ఒక్కరికి తెలియాలి. ప్రస్తుతం మనం కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఏం తినకూడదు అనే అంశాలను తెలుసుకుందాం. కిడ్నీల ఆరోగ్యం కోసం ఇవి తినొద్దు కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలని భావించేవారు ప్రతిరోజు మనం తీసుకునే ఆహారంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా కిడ్నీల ఆరోగ్యం కోసం ప్రాసెస్ చేసిన ఆహారాలను తినకుండా ఉండాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలలో అధిక స్థాయిలో సోడియం ఉండడం వల్ల అవి తినడం వల్ల అవి మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని తీసుకువస్తాయి. కాబట్టి కిడ్నీల ఆరోగ్యం కోసం ప్రాసెస్ చేసిన మాంసాన్ని, ప్రాసెస్ చేసిన ఆహారాలను తినకుండా ఉండాలని సూచన. ఇవి తింటున్నారా.. కిడ్నీలకు డేంజర్ జాగ్రత్త అంతేకాదు కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలని భావించేవారు మయనీస్ కు దూరంగా ఉండాలి. చాలామంది సలాడ్లు, శాండ్విచ్ లలో మయనీస్ ను వాడుతూ ఉంటారు. మయనీస్ అధికంగా తీసుకోవడం వల్ల మూత్రపిండాల సమస్య వస్తుంది. చాలామంది బంగాళదుంపలతో చేసిన ఆహారాన్ని ఎక్కువగా తింటూ ఉంటారు. డీప్ ఫ్రై లు, ఫ్రెంచ్ ఫ్రైస్, చిప్స్ వంటి వాటిని ఎక్కువ తింటారు. ఇవి కిడ్నీల ఆరోగ్యాన్ని పాడు చేస్తాయి అధికంగా తీసుకోకుండా ఉంటే మంచిది. ఇవి తాగితే కిడ్నీల ఆరోగ్యం పాడవుతుంది కొంతమంది సోడాలను ఎక్కువ తాగుతారు సోడా తాగడం ఆరోగ్యానికి ఏ రకంగాను మంచిది కాదు. సోడా లలో చెక్కర ఎక్కువగా ఉంటుంది. ఇవి తాగడం వల్ల మూత్రపిండాలు దెబ్బ తినే పరిస్థితి ఉంది. ఎక్కువగా చూడాలి తాగే వారిలో ఎముకలు బలహీనపడతాయి. ఇది మూత్రపిండాల వ్యాధికి కూడా దోహదం చేస్తుంది. కాబట్టి తాగకుండా ఉంటేనే మంచిది. మునక్కాయల ఆరోగ్య అద్భుతాలు చూస్తే వదిలిపెట్టరు! ఈ ఆహారాలను తినకండి ఇక మూత్రపిండాల ఆరోగ్యం కోసం ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలను తినకూడదు. ఊరగాయలు, రెడీ టు ఈట్ మీల్స్ వంటి వాటిని తినకుండా ఉంటే మంచిది. ఇవి కిడ్నీల పైన ఒత్తిడి పెంచి అనవసరపు అనారోగ్యాలను కలిగిస్తాయి. కనుక కిడ్నీల ఆరోగ్యం కోసం పైన పేర్కొన్న ఆహారాలను తినకుండా జాగ్రత్తలు తీసుకోండి.

## మార్కెట్

### బీఎండబ్ల్యూ 2 సిరీస్ గ్రాన్ కూపే గరిష్ఠ ధర రూ.49 లక్షలు

న్యూఢిల్లీ : దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి బీఎండబ్ల్యూ తీసుకొచ్చింది. చెన్నై ప్లాంట్లో తయారైన బీఎండబ్ల్యూ 2 సిరీస్ గ్రాన్ కూపే దేశవ్యాప్తంగా ఉన్న డీలర్ల వద్ద ముందస్తు బుకింగ్ చేసుకోవాల్సి వుంటుందని సూచించింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ధర రూ.46.90 లక్షల నుంచి రూ.48.90 లక్షల లోపు లభించనున్నది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ కారుపై మూడేండ్లు లేదా 40 వేల కిలోమీటర్ల వరకు మెయింటెనెన్స్ వర్క్ ప్యాకేజీని అందిస్తున్నది.



# డిజిటల్‌లో చెల్లింపుల్లో దూసుకుపోతున్న భారత్..

### నెలలోనే 18.39 బిలియన్స్ లావాదేవీలు..!



డిజిటల్ చెల్లింపుల్లో భారత్ దూసుకుపోతున్నది. యూపీఐ పేమెంట్స్‌లో భారత్ ప్రపంచ అగ్రగామిగా నిలిచిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. భారత్‌లో ప్రతినెలా రూ.1800 కోట్లకుపైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయని పేర్కొంది. 'ది రైజ్ ఆఫ్ రిటైల్ డిజిటల్ పేమెంట్స్: ది ఇంపార్టెన్స్ ఆఫ్ ఇంటర్‌ఆపరబిలిటీ' పేరుతో ఐఎంఎఫ్ ఈ నివేదికను విడుదల చేసింది. యూపీఐ ద్వారా ఈ ఏడాది జూన్‌లో రూ.24.03 లక్షల కోట్ల సొత్తు ట్రాన్సాక్షన్స్ జరిగాయి. మొత్తం 18.39 బిలియన్ లావాదేవీలు నమోదైనట్లుగా నివేదిక పేర్కొంది. గతేడాది ఇదే నెలలో 13.88 బిలియన్ లావాదేవీలు జరగ్గా.. 32శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుతం 49.1 కోట్ల మంది సామాన్య ప్రజలు, 6.5 కోట్ల మంది వ్యాపారులు ఈ యూపీఐ సేవలను వినియోగిస్తున్నారు. 675 బ్యాంకులు యూపీఐతో కలిసి పని చేస్తున్నాయి. అయితే, మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో 85శాతం యూపీఐ ద్వారా భారత్‌లో జరుగుతున్నాయి. రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 50 శాతం ఒక్క భారతదేశంలోనే జరుగుతున్నాయి. ఈ యూపీఐ సేవలు భారత్‌తో పాటు యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్ దేశాల్లోనూ కొనసాగుతున్నాయి. అయితే, బ్రిక్స్ సభ్యత్వ దేశాలకు యూపీఐని విస్తరించాలని రిజర్వ్ బ్యాంక్ యోచిస్తున్నది. సురక్షితమైన, వేగవంతమైన లావాదేవీలతో యూపీఐ చెల్లింపులు ప్రజల్లో భారీగా పెరిగింది. 2016లో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రారంభించిన యూపీఐ సర్వీసులకు మంచి స్పందన లభిస్తున్నది. అప్పటి నుంచి ఏటా యూపీఐ లావాదేవీలు పెరుగుతూ వచ్చాయి. యూపీఐ ద్వారా ఎన్ని బ్యాంక్ అకౌంట్స్ ఉన్నా ఆయా అకౌంట్లను ఒకే మొబైల్ యాప్‌లో లింక్ చేసుకునేందుకు అవకాశం ఉంది. ఎవరు ఎవరికైనా డబ్బులు పంపడం, దుకాణంలో బిల్లులు చెల్లించేందుకు సైతం అవకాశం ఉన్నది.




### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1:1 బోనస్ షేరు

#### రూ.5 ప్రత్యేక డివిడెండ్‌ను ప్రకటించిన బ్యాంక్

ముంబై : ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ కన్సాలిడేటెడ్ నికర లాభం 1.31 శాతం తగ్గి రూ.16,258 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో బ్యాంక్ రూ.16,475 కోట్ల లాభాన్ని గడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.83,701 కోట్ల నుంచి రూ.99,200 కోట్లకు ఎగబాకింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.14,442 కోట్ల నిధులను వెచ్చించడంతో లాభాల్లో గండిపడిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.33 శాతం నుంచి 1.4 శాతానికి పెరిగాయి. మరోవైపు, వాటాదారులకు బ్యాంక్ శుభవార్తను అందించింది. 1:1 బోనస్ షేరును ప్రకటించింది. ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా శనివారం సమావేశమైన బ్యాంక్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నది. దీంతోపాటు రూ.5 ప్రత్యేక డివిడెండ్ చెల్లింపులు జరపనున్నట్లు వెల్లడించింది.

# ఆంధ్రప్రదేశ్

## ఆకివీడు రామాలయ నిర్మాణం కేసు

### పిటిషన్‌ను కొట్టి వేసిన ఎపి హైకోర్టు

అమరావతి : పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడులో రామాలయం నిర్మాణం అనుమతులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే గత 80 సంవత్సరాలుగా అక్కడ రామాలయం ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. అన్ని ఆధారాలు, రికార్డులు పరిశీలించిన తరువాత జిల్లా కలెక్టర్, నగర పంచాయితీ కమిషనర్ రామాలయం నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని పేర్కొంది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో రామాలయం నిర్మాణాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిల్‌పై హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారణ జరిపిన అనంతరం.. దీనిపై ఇప్పటికే హైకోర్టు సింగిల్ బెంచ్‌లో రిట్ పిటిషన్లు ఉన్నందున అక్కడే తేల్చుకోవాలని తెలిపింది. ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని హైకోర్టు చెప్పగా.. డిస్పోజ్ చేయాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోరారు. దీంతో ఈ పిటిషన్‌ను హైకోర్టు డిస్పోజ్ చేసింది. అంతేకాకుండా పిల్‌ను ఉపసంహకరించుకున్నట్లు పిటిషనర్ల న్యాయవాది తెలిపారు. తాజాగా ఆలయ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈరోజు(మంగళవారం) హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. 80 సంవత్సరాలుగా అక్కడ రామాలయం ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉందని.. అన్నింటినీ పరిశీలించాకే కలెక్టర్, నగర పంచాయితీ కమిషనర్ అనుమతులు ఇచ్చారని పేర్కొంటూ.. పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

## భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యం

### జలధార - జల హారతి కార్యక్రమంపై మంత్రి

నంద్యాల,మే5 : రాష్ట్రంలో భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సూచనల మేరకు జలధార - జల హారతి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనిచేస్తోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. హనుమంత గుండం చెరువు నుంచి దాదాపు 23 కిలోమీటర్లు కాలువ పొడవున ఉన్న 5 చెరువుల్లో, వాగులు, వంకల్లో మట్టి పూడికతీత పనులను సొంత నిధులతో చేపట్టామని అన్నారు. 3 మీటర్లలోపు భూగర్భ జలాలు వచ్చేలా కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. భూగర్భ జలాలు పెరిగితే రైతులంతా తమ బోర్ల ద్వారా పంటలను సాగు చేసుకునే వీలుంటుందని బీసీ జనార్దన్ వెల్లడించారు. 23 కిలోమీటర్ల కాల్వ పొడవున జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు ఐదు చెరువుల్లో మట్టి పూడికతీత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చెరువులు, కాలువల్లో పూడికతీత కార్యక్రమంలో భాగంగా మట్టిని.. అవసరమైన రైతులు తీసుకువెళ్లే విధంగా వెసులుబాటు కల్పించనున్నట్లు చెప్పారు. మట్టిని తీసుకెళ్లే రైతులను ఇబ్బంది పెట్టకుండా అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం జలహారతి – జలధార కార్యక్రమాన్ని ఒక యజ్ఞం మాదిరిగా చేస్తోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఐఎఎస్ అహ్మద్ బాబుకు హైకోర్టులో చుక్కెదురు

### ఉద్యోగ సంఘాల పిటిషన్ కొట్టేసేందుకు తిరస్కరణ

అమరావతి,మే5 : ఐఏఎస్ అధికారి అహ్మద్ బాబుకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. ఉద్యోగుల సంఘం చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టు ఆదేశించింది. ఐఏఎస్ అహ్మద్ అనర్హుడంటూ హైకోర్టులో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ కొనసాగుతుండగా.. పిటిషన్‌ను కొట్టివేయాలని అహ్మద్ బాబు అప్పీల్ చేసుకున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం పిటిషన్‌పై విచారణ జరిపి.. స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఉద్యోగుల సంఘం ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. గత కొన్ని రోజులుగా అహ్మద్ బాబుకు వ్యతిరేకంగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అన్ని కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయాల ముందు మధ్యాహ్న భోజన సమయంలో ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. చాలా మంది ఉద్యోగుల ప్రమోషన్లను అహ్మద్ తొక్కిపెడుతున్నారంటూ ఉద్యోగ సంఘాలు ఆరోపించాయి. దీనికి సంబంధించి సోమవారం అధికారులతో మంత్రి పయ్యావుల కేశవ్ సమావేశమై.. కోర్టు ఆదేశాలను పాటించాలని, ప్రమోషన్లపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తరుణంలో అహ్మద్ బాబు అప్పీల్‌కు వెళ్లడంతో హైకోర్టులో విచారణ జరిగింది. రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖతో పాటు అహ్మద్ బాబు నిర్వహిస్తున్న శాఖల్లో ఏదీ సవ్యంగా లేనట్లు కనిపిస్తోందని సింగిల్ జడ్జి చేసిన అబ్జర్వేషన్ ను ధర్మాసనం పక్కనపెట్టింది. ఉద్యోగ సంఘం వినతిని పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశిస్తూ.. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది.

## టెన్త్‌లో సత్తా చాటిన అనాథ బాలుడు

### విద్యార్థి పవన్‌ను అభినందిస్తూ డిప్యూటి సిఎం పోస్ట్

అమరావతి,మే5 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'భగవంతుని పిల్లలు పేరుతో తల్లిదండ్రులు లేని పిల్లలను కొంతమందిని ఎంపిక చేసి, వారికి తన జీతం నుంచి ప్రతి నెలా రూ. 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నారు. పవన్ ఆర్థిక సాయం అందిస్తున్న ఓ బాలుడు పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటాడు. ఏకంగా 555 మార్కులు సాధించాడు. యు. కొత్తపల్లి మండలం, కొత్త ఇసుకపల్లి గ్రామానికి చెందిన ఆకుల పవన్ కుమార్ 555 మార్కులు సాధించాడు. పవన్ కుమార్ పదో తరగతి పరీక్షల్లో 555 మార్కులు సాధించటంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తరఫున ఏపీ డిప్యూటీ సీఎంఓ అభినందనలు తెలియజేసింది. ఈ మేరకు మంగళవారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'పిఠాపురం నియోజకవర్గం, యూ. కొత్తపల్లి మండలం, కొత్త ఇసుకపల్లి గ్రామానికి చెందిన ఆకుల పవన్ కుమార్ మొన్న విడుదలైన 10వ తరగతి పరీక్షల్లో 555 మార్కులు సాధించినందుకు హృదయపూర్వక అభినందనలు. ప్రతీ నెల ఉప ముఖ్యమంత్రి జీతం నుంచి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందుకుంటున్న భగవంతుని పిల్లల్లో ఒకరైన పవన్ కుమార్ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తరఫున అభినందనలు తెలియజేస్తున్నాము' అని పేర్కొంది.

## అన్నిరకాల దౌర్జన్యాలు చేశారు

### తనపై కూడా దాడికి తెగబడ్డారు

### ఫేస్‌బుక్ పేజీలో మమత ఫోన్‌కాల్ ఆడియో



కోల్‌కతా : కౌంటింగ్ సెంటర్‌లో తనపై దాడి జరిగినట్లు మమతా బెనర్జీ పేర్కొన్నారు. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీతో ఫోన్‌కాల్‌లో ఆమె ఈ ఆరోపణలు చేశారు. మమతా బెనర్జీ మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను ఎంపీ కల్యాణ్ బెనర్జీ తన ఫేస్‌బుక్ పేజీలో పోస్టు చేశారు. కౌంటింగ్ వద్ద ప్రవర్తన సరిగా లేదని, తుది రౌండ్ల సమయంలో అక్రమాలు జరిగినట్లు మమతా బెనర్జీ తన ఫోన్ కాల్‌లో పేర్కొన్నారు. భబానీపూర్‌లో తుది రౌండ్ల కౌంటింగ్ మా ప్రాంతానివని, ఆ సమయంలో కొందరు గుండాలు కౌంటింగ్ సెంటర్‌లోకి ప్రవేశించారని, నన్ను కొట్టారని, సీఆర్పీఎఫ్ సహాయంతో మా ఏజెంట్లను తోసేశారని మమతా బెనర్జీ ఆ ఫోన్‌కాల్‌లో ఆరోపించారు. కీలక సమయంలో కౌంటింగ్ హాల్‌లోకి తనను ఎంట్రీ కానివ్వ లేదన్నారు. భబానీపూర్‌లో కౌంటింగ్ ప్రక్రియ థ్రిల్లింగ్‌గా సాగింది. 20 రౌండ్ల కౌంటింగ్‌లో కొన్ని సమయాల్లో అటూ ఇటూ వెళ్లింది. ఆరంభంలో మమతా బెనర్జీ రెండు వేల ఓట్ల మెజారిటీతో ఉన్నారు. ఏడో రౌండ్ సమయానికి ఆమె 17 వేల ఓట్లు ఆధిక్యంలోకి వెళ్లారు. ఇక ఆ సమయంలో టీఎంసీ మద్దతుదారులు దాదాపు సంబరాలు చేసుకున్నారు. ఇక తర్వాత ఫలితాల్లో మార్పు మొదలైంది. 14వ రౌండ్ ముగిసే వరకు మమతా బెనర్జీ ఆధిక్యం నాలుగు వేలకు పడిపోయింది. కొన్ని రౌండ్ల తేడాలోనే నాటకీయంగా బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి ఆధిక్యంలోకి వెళ్లారు. ఆ తర్వాత ఆయన 15,105 ఓట్ల తేడాతో విజయాన్ని నమోదు చేశారు. దీంతో దీదీకి షాక్ ఇచ్చాడు సువేంధు. 16వ రౌండ్ వరకు తానే లీడింగ్‌లో ఉన్నట్లు మమతా బెనర్జీ పేర్కొన్నారు. కానీ తమ పార్టీకి చెందిన కౌంటింగ్ ఏజెంట్లను తొలగించిన తర్వాత మార్పు మొదలైనట్లు ఆమె ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లను సరైన సీలింగ్ లేకుండానే స్ట్రాంగ్‌రూమ్ లకు తరలించారని, తుది రౌండ్ల కౌంటింగ్ సమయంలో కౌంటింగ్ హాల్‌లో టీఎంసీ ప్రతినిధులు లేరని ఆమె పేర్కొన్నారు. చిత్రహింసకు గురిచేసినట్లు మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్రం, బీజేపీ ఆదేశాల ప్రకారమే ఎన్నికల సంఘం, సీఆర్పీఎఫ్, స్థానిక ఎన్నికల అధికారులు వ్యవహరించినట్లు మమతా బెనర్జీ విమర్శించారు. ఓటర్ రోల్స్‌లోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. బలవంతంగా ఓట్లను చోరీ చేశారన్నారు. అన్ని ఆధారాలను డాక్యుమెంట్ చేశామని, వాటిని కోర్టులో సమర్పించనున్నట్లు తెలిపారు. ఇది బీజేపీ విజయం కాదు, అనైతిక గేమ్ అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. తాజాగా ఎన్నికల్లో ఆ పార్టీకి కేవలం 81 సీట్లు మాత్రమే వచ్చాయని తేలింది. బీజేపీ 206 స్థానాల్లో విజయ కేతనం ఎగురవేసింది. అయితే భవానీపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సీఎం మమతా బెనర్జీ అనూహ్య రీతిలో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజా తీర్పును చోరీ చేశారని ఆమె అన్నారు. అనైతిక రీతిలో తనను ఓడించినట్లు ఆమె చెప్పారు.

## భార్యను చంపడమెలా? ఇంటర్నెట్‌లో శోధించిన భర్త

### పద్మజ హత్య కేసును ఛేదించిన పోలీసులు

కడప,మే5 : ఇటీవల సంచలనం రేపిన ప్రొద్దుటూరులో పద్మజ మృతి కేసును పోలీసులు ఛేదించారు. భర్త కిరణ్‌కుమార్ ఆమెను హత్య చేసినట్లు నిర్ధరించారు. అతడిని అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరుపరిచారు. వివరాలను పోలీసు అధికారులు మీడియాకు వెల్లడించారు. భార్యను హత్య చేసేందుకు కిరణ్ యూట్యూబ్‌లో శోధించినట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరుకు కొరియర్ ద్వారా విషం తెప్పించాడు. పాలకోవలో విషం కలిపి భార్యకు ఇచ్చాడు. పాలకోవ తిన్న తర్వాత పద్మజ అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అనంతరం ఆమె చనిపోయిందో లేదోనని ముఖంపై దిండుతో నొక్కాడు. భార్య లావుగా ఉండటంతోపాటు, తనను నిత్యం అనుమానిస్తోందన్న కారణంతోనే హత్య చేశాడని పోలీసులు తెలిపారు. పెళ్లైన నాటి నుంచి కలిసి మెలిసి ఉండాల్సిన భర్తే ఇలా కాలయముడయ్యాడు. భార్యను చంపడానికి ఒక ప్రొఫెషనల్ కిల్లర్ లాగా ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి, పథకం ప్రకారం హత్య చేసిన సంఘటన ఇది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 29వ తేదీన నిందితుడైన కిరణ్, తన భార్య పద్మను నిద్రిస్తున్న సమయంలో దిండుతో ముఖంపై అదిమి పట్టుకున్నాడు. ఊపిరాడకుండా చేసి అత్యంత కిరాతకంగా ఆమెను హతమార్చాడు. ఈ హత్య యాదృచ్ఛికంగా జరిగింది కాదని.. కిరణ్ గత కొంతకాలంగా ఇంటర్నెట్‌లో 'భార్యను ఎలా చంపాలి?', 'ఎలాంటి ఆధారాలు దొరకకుండా హత్య చేయడం ఎలా?' అని గూగుల్‌లో సెర్చ్ చేశాడని పోలీసులు తెలిపారు. కేవలం దిండుతో చంపడమే కాకుండా, భార్యకు విషం ఇచ్చి చంపడానికి కూడా నిందితుడు ప్రయత్నించాడు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా ఏకంగా రూ. 80,000 ఖర్చు చేసి విషాన్ని ఆర్డర్ చేయడం గమనార్హం. పద్మ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి. అతని సెల్‌ఫోన్, ఇంటర్నెట్ హిస్టరీని పరిశీలించగా, హత్యకు సంబంధించిన కుట్ర అంతా బట్టబయలైంది. నేరస్థులు ఎంత తెలివిగా ఎ÷–లాన్ చేసినా, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పోలీసులు వారిని పట్టుకోగలరని ఈ కేసు మరోసారి నిరూపించింది. కేవలం గూగుల్ సెర్చ్ చేసిన ఆధారాలతోనే నిందితుడి పక్కా ఎ÷–లాన్‌ను పోలీసులు బహిర్గతం చేశారు. పద్మ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, కిరణ్‌ను కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

## బెంగాల్, అసోంలకు బిజెపి పరిశీలకుల నియామకం

### అమిత్ షా, జెపి నడ్డాలకు పార్టీ బాధ్యతలు

న్యూఢిల్లీ,మే5 : పశ్చిమ బెంగాల్, అసోంలలో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో అక్కడ ప్రభుత్వాల ఏర్పాటుకు బిజెపి రంగం సిద్ధం చేసింది. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుంది. బెంగాల్ సీఎం ఎవరూ అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బీజేపీ అధిష్టానం నియమించింది . అలాగే, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీని సహ పరిశీలకుడిగా నియమించింది. అమిత్ షా, మోహన్ చరణ్ ఆధ్వర్యంలో బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు, అగ్రనేతలు సమావేశమవుతారు. బెంగాల్ బీజేపీ లెజిస్లేటివ్ నేతను ఎన్నుకుంటారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నుకోవడం, కొత్త ప్రభుత్వ ఏర్పాటును షా, మోహన్ పర్యవేక్షిస్తారు. బెంగాల్‌లో ఈ నెల 9న కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ 207 సీట్లు గెలుచుకుంది. మరోవైపు అసోంకు సంబంధించి ప్రభుత్వ ఏర్పాటుకోసం కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర మంత్రి, బీజేపీ మాజీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను బీజేపీ నియమించింది. నడ్డాతోపాటు సహపరిశీలకుడిగా హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైని వ్యవహరిస్తారు. వీరు ఇద్దరూ అసోంలో బీజేపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటు, లెజిస్లేటివ్ పార్టీ లీడర్ ఎన్నికను పర్యవేక్షిస్తారు. అసోంలో బీజేపీ కూటమి 82 సీట్లు గెలుచుకుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తొలిసారి అధికారం చేపట్టబోతుంది. దీంతో ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో ఆసక్తి నెలకొంది. బీజేపీ అధిష్టానం ఎవరిని నియమిస్తుందో చూడాలి. ప్రస్తుతానికి సువేందు అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అసోంలో ఇప్పటికే బీజేపీ నుంచి సీఎంగా ఉన్న హిమంత బిశ్వ శర్మ అదే పదవిలో కొనసాగుతారు.

## ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు పులిట్జర్

న్యూఢిల్లీ,మే5 : భారతీయ ఇలుస్ట్రేటర్ ఆనంద్ ఆర్‌కే, జర్నలిస్టు సుపర్ణ శర్మ.. 2026 పులిట్జర్ అవార్డును గెలుచుకున్నారు. ఇలుస్ట్రేటెడ్ రిపోర్టింగ్ అండ్ కామెంటరీ విభాగంలో వాళ్లు ఈ అవార్డు చేజిక్కించుకున్నారు. ట్రాప్డ్ అనే కథనం కోసం ఆ ఇద్దరు జర్నలిస్టులతో కలిసి నాటాలీ ఒబికో పియర్సన్ కూడా పనిచేశారు. ఈ ముగ్గురూ అవార్డును షేర్ చేసుకున్నారు. డిజిటల్ అరెస్టుకు చెందిన కథనాన్ని చాలా సునిశితంగా ప్రజెంట్ చేశారు. చాలా బలమైన విజువల్స్‌తో ఆ కథనాన్ని ప్రసారం చేశారు. దక్షిణాసియాలో సైబర్ నేరగాళ్ల ముఠా ఎలా పనిచేస్తుందన్న కోణంలో ట్రాప్డ్ కథనంలో చూపించారు. న్యూయార్క్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పులిట్జర్ ప్రైజ్ విజేతలను ప్రకటించారు. ఆరితేరిన సైబర్ నేరగాళ్లు ఎలా ఓ భారతీయ న్యూరాలజిస్టును బోల్తా కొట్టిస్తారో ట్రాప్డ్ స్టోరీలో ప్రజెంట్ చేశారు. ఇన్వెస్టిగేట్ జర్నలిజం విధానంలో ఈ కథనం సాగుతుంది. కథనంలో ఎడిటోరియల్ గాఢత ఎక్కువగా ఉన్నట్లు పులిట్జర్ బోర్డు ప్రశంసించింది. ట్రాప్డ్ ప్రాజెక్టు కోసం ముంబై ఆర్టిస్టు ఆనంద్ ఆర్కే బొమ్మలను గీశారు. గ్రాఫిక్ స్టోరీటెల్లింగ్‌లో అతను మాస్టర్. గతంలో ఆయన 2021లో ఈస్నర్ అవార్డు గెలుచుకున్నారు. బ్లూ ఇన్ గ్రీన్ అనే గ్రాఫిక్ నవలకు ఆ అవార్డు వచ్చింది. ఇక జర్నలిస్టు సుపర్ణ శర్మ ఈ కథనానికి రిపోర్టింగ్ చేశారు. బ్లూమ్‌బర్గ్‌కు చెందిన టోక్యో రిపోర్టర్ నటాలీ ఒబికో పియర్సన్ కూడా ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ చేశారు. అంతర్జాతీయ రిపోర్టింగ్ కేటగిరీలో మరో భారతీయ జర్నలిస్టు అనిరుద్ధ్ ఘోసల్ పులిట్జర్ ప్రైజ్ గెలిచారు. అమెరికా బోర్డర్ పెట్రోలింగ్ పోలీసులకు చెందిన నిఘా వ్యవస్థల టెక్నాలజీ గురించి ఇన్వెస్టిగేట్ చేశారు.

## తమిళనాట కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కసరత్తు

### 7న ప్రమాణం చేస్తామని ప్రకటించిన టివికె

### గవర్నర్‌కు లేఖ రాసిని టివికె చీఫ్ విజయ్

చెన్నై,మే5(ఆర్ఎన్ఎ): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన తమిళగ వెట్రి కళగం పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహకాలు చేస్తోంది. పార్టీ అధినేత విజయ్ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక కావడంతో ఈనెల 7న కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణస్వీకర కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అనూహ్యంగా 108 స్థానాల్లో విజయం సాధించిన ప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 118 సీట్లను దక్కించుకోలేకపోయింది. మెజారిటీకి మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంది. టీవీకే సారథ్యంలోని ప్రభుత్వానికి మద్దతిచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సుముఖంగా ఉందని వినిపిస్తోంది. వామపక్ష పార్టీలు సైతం టీవీకే నేతలతో సంప్రదింపులు సాగించనున్నట్టు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్–5, వీసీకే–2, సీపీఐ–2, సీపీఎం–2 సీట్లు గెలుచుకున్నాయి. ఐయూఎంఎల్, డీఎండీకే, పీఎంకే పార్టీలను నుంచి కూడా టీవీకేకు మద్దతు లభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. కాగా, ప్రభుత్వం ఏర్పాటుకు తమను ఆహ్వానించాల్సిందిగా గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌కు విజయ్ మంగళవారంనాడు లేఖ రాసినట్టు తెలుస్తోంది. మెజారిటీ నిరూపించు కునేందుకు రెండు వారాలు గడువివ్వాలని ఆ లేఖలో కోరినట్టు సమాచారం. మరోవైపు, ఓటమి నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన పదవికి రాజీనామా చేశారు. గవర్నర్‌ను కలిసి రాజీనామా పత్రాన్ని సమర్పించారు. దానిని గవర్నర్ వెంటనే ఆమోదించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేంత వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని స్టాలిన్‌ను గవర్నర్ కోరారు.

## విశాఖ రైల్వే జోన్ గెజిట్ విడుదల

### రాయగడ కేంద్రంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఏర్పాటు

### రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ

విశాఖపట్టణం,మే5 : విశాఖపట్టణం కేంద్రంగా కొత్త రైల్వేజోన్ గెజిట్‌ను కేంద్ర రైల్వే బోర్డు అధికారికంగా విడుదల చేసింది. జూన్ 1, 2026 నుంచి దక్షిణ కోస్తా రైల్వేను అధికారికంగా ప్రారంభించనుంది. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో రాయగడ కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటైంది. వాల్తేరు డివిజన్‌ను విభజించి విశాఖపట్టణం, రాయగడ డివిజన్లుగా మార్పు చేసింది. దక్షిణ కోస్తా, ఈస్ట్ కోస్ట్, దక్షిణ మధ్య రైల్వేల పరిధిలో కీలక మార్పులు చేసింది. పాత వాల్తేరు డివిజన్‌లోని విశాఖ నగరం సహా పరిసర ప్రాంతాలు ఇకపై విశాఖపట్టణం డివిజన్‌గా మార్చింది. రాయగడ కేంద్రంగా ఏర్పాటయ్యే కొత్త డివిజన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే కింద పనిచేస్తుందని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. దక్షిణ కోస్తా రైల్వే పరిధి కొత్త జోన్ పరిధిలోకి గుంతకల్, గుంటూరు, విజయవాడ, విశాఖపట్టణం డివిజన్లను ఏర్పాటుచేసింది. ఇకపై సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు మాత్రమే దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉంటాయని తెలిపింది. ఖుర్దా రోడ్ డివిజన్‌లో గల 'ఇచ్ఛాపురం నుంచి పలాస' వరకు గల మార్గాన్ని విశాఖపట్టణం డివిజన్‌కు బదిలీ చేసింది. గుంతకల్ డివిజన్ నుంచి 'రాయచూర్ – వాడి సెక్షన్' సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అయింది. పగిడిపల్లి – విష్ణుపురం మార్గాన్ని.. గుంటూరు డివిజన్ నుంచి సికింద్రాబాద్ డివిజన్‌కు మార్పు చేసింది. కొండపల్లి – మోటుమర్రి మార్గాన్ని సికింద్రాబాద్ డివిజన్ నుంచి విజయవాడ డివిజన్‌కు బదిలీ చేసింది. రాయగడ, విశాఖపట్టణం డివిజన్ల మధ్య సింగపూర్ రోడ్ – విజయనగరం కొత్త సరిహద్దు ఖరారు చేసింది. సౌత్ పోస్ట్, ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజన్ల మధ్య స్పష్టమైన సరిహద్దు కిలోమీటర్లను గెజిట్‌లో రైల్వే బోర్డు వెల్లడించింది. ఈ మార్పులన్నీ జూన్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో రైల్వే బోర్డు స్పష్టం చేసింది.

## పెరిగిన పత్తి ధరలు

### క్వింటాకు రూ.800 పైగా ధర జంప్

కర్నూలు,మే5 : కర్నూలు జిల్లా ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు భారీగా పెరిగాయి. పదిహేను రోజుల్లో పత్తిధర క్వింటాకు రూ.800 పైగా ధర పెరిగింది. ఇప్పటికే పత్తి సీజన్ ముగియడంతో అరకొర పత్తి రైతులు విక్రయానికి తీసుకొస్తుండడంతో వ్యాపారుల మధ్య పోటీ నెలకొనడంతో ధరలు పెరగడానికి కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ దూది ధరలు పెరి గాయని, దీంతో స్థానిక మార్కెట్ యార్డులో ధరలు పెరగడానికి మరో కారణమని తెలిపారు. ధరలు పెరగడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 758 క్వింటాల పత్తి విక్రయానికి రాగా.. గరిష్ఠ ధర రూ.9615, మధ్యస్థం రూ.9,300 కనిష్ఠం రూ.5,525 పలికింది.

## ఇంటర్ అడ్మిషన్ల సర్క్యులర్ నిలిపివేత

### ఇంటర్ బోర్డు అనూహ్య నిర్ణయం

హైదరాబాద్,మే5 : ఇంటర్ అడ్మిషన్ షెడ్యూల్‌పై తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఎడ్యుకేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. 2026–27 విద్య సంవత్సరానికి సంబంధించిన సర్క్యులర్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ మేరకు మంగళవారం టీజీబీఐఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రతిపాదిత సంస్కరణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. త్వరలో కొత్త మార్గదర్శకాలు విడుదల చేస్తామని ఇంటర్ బోర్డు ప్రకటించింది. అన్ని జూనియర్ కాలేజీలకు ఈ ఆదేశాలు జారీ చేసినట్లు వివరించింది. మే 4వ తేదీన ఈ విద్య సంవత్సరానికి సంబంధించిన సర్క్యులర్‌ను టీజీబీఐఈ జారీ చేసిన సంగతి తెలిసిందే.




# విజయ్ విజయంతో మారిన సీన్

## జననాయగన్ విడుదలకు క్లియర్ కానున్న లైన్

తమిళ స్టార్ హీరో జోసెఫ్ విజయ్ సినీ ప్రయాణంలో అత్యంత కీలకంగా నిలిచిన చిత్రం 'జన నాయగన్' ఇప్పుడు ఇండియన్ సినిమా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాను తన ఆఖరి చిత్రంగా ప్రకటించిన విజయ్, ఇకపై పూర్తిస్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టనున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఏర్పడింది. ప్రతిభావంతుడైన దర్శకుడు హెచ్ వినోద్ తెరకెక్కించిన ఈ చిత్రం అసలు ఎన్నికలకు ముందు విడుదల కావాల్సి ఉంది. అయితే పలు కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది. నిర్మాణంలో ఆలస్యం, రాజకీయ పరిస్థితులు, అలాగే అనుకోని అడ్డంకులు 'జన నాయగన్' ప్రయాణాన్ని కష్టతరం చేశాయి. ఇంతేకాకుండా, ఈ చిత్రానికి సంబంధించిన ఓటిటి డీల్ కూడా మధ్యలో నిలిచిపోయినట్లు ప్రచారం జరిగింది. అదే సమయంలో సినిమాపై ఉన్న హైప్ కూడా కొంత వరకు తగ్గిందనే అభిప్రాయాలు వినిపించాయి. ఈ పరిణామాలన్నీ కలిసి సినిమా ప్రభావం తగ్గిపోయిందనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే తాజా రాజకీయ పరిణామాలు 'జన నాయగన్'కు పూర్తిగా కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని పార్టీ ఘనవిజయం సాధించడంతో ఆయన అభిమానుల్లో అపారమైన ఉత్సాహం కనిపిస్తోంది. ఒక హీరోగా మాత్రమే కాకుండా, నాయకుడిగా కూడా విజయ్‌పై ఉన్న విశ్వాసం ఇప్పుడు మరింత బలపడింది. ఇప్పటికే గతంలో 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం' వంటి భారీ ప్రాజెక్ట్‌తో విజయ్ తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించారు. భారీ బడ్జెట్, భారీ అంచనాల మధ్య వచ్చిన ఆ సినిమా కూడా అనుమానాలను చెరిపేసి మంచి వసూళ్లు సాధించింది. ఇప్పుడు అదే స్థాయిలో, అంతకంటే ఎక్కువగా 'జన నాయగన్'పై అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా, ఒక నటుడు ముఖ్యమంత్రిగా మారిన తర్వాత విడుదలవుతున్న అతని ఆఖరి సినిమా కావడం ఈ చిత్రానికి అదనపు క్రేజ్ తీసుకొచ్చింది. అభిమానులు ఈ సినిమాను కేవలం సినిమాగా కాకుండా, ఒక భావోద్వేగంగా చూస్తున్నారు. తమ హీరో రాజకీయాల్లో విజయం సాధించిన ఆనందంలో, ఈ సినిమాకు అపారమైన ఓపెనింగ్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. బాక్సాఫీస్ ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, 'జన నాయగన్' ఓపెనింగ్స్ కోలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా రికార్డులు బద్దలు కొట్టే అవకాశముంది. మొదటి రోజు వసూళ్లు ఊహించలేనంత స్థాయిలో ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఒకవేళ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే, వసూళ్లు ఎక్కడ ఆగుతాయో అంచనా వేయడం కూడా కష్టమవుతుంది.




# ఓటిటిలోకి వచ్చేసిన పాపం ప్రతాప్

టాలీవుడ్ యంగ్ టాలెంటెడ్ నటుడు తిరువీర్ హీరోగా నటించిన లేటెస్ట్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'పాపం ప్రతాప్' ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రం సుమారు మూడు వారాల తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్‌కు వస్తోంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఈటీవీ విన్' ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా మే 7 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఎస్పీ దుర్గా నరేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తిరువీర్ సరసన పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటించగా, అజయ్ ఘోష్ కీలక పాత్రలో మెరిశారు. తండ్రి ఇష్టానికి వ్యతిరేకంగా ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకున్న ప్రతాప్ అనే యువకుడికి, పెళ్లయిన మూడు రోజులకే తన భార్య దూరమవ్వడం.. ఆమె తనపై ఒక వింత ఆరోపణ చేయడం అనే ఆసక్తికరమైన పాయింట్‌తో ఈ సినిమా సాగుతుంది. గ్రామీణ నేపథ్యంలో సాగే సహజసిద్ధమైన కామెడీ మరియు భావోద్వేగాల కలయికతో రూపొందిన ఈ చిత్రం డిజిటల్ వేదికగా రాబోతుండడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సుకుమార్‌తో రామ్‌చరణ్ తదుపరి చిత్రం

## జూలైలో పట్టాలకెక్కే అవకాశం

కథానాయకుడు రామ్‌చరణ్ 'పెద్ది' సినిమాని ఇప్పటికే పూర్తి చేశారు. ఇది జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఇప్పుడు అందరి చూపు ఆయన తదుపరి చిత్రంపై పడింది. 'ఆర్‌సీ17' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ సినిమాకి సుకుమార్ దర్శకత్వం వహించనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు ఓ కొలిక్కి వచ్చాయని.. సుకుమార్ దీనికి తుది మెరుగులు దిద్దడంలో తలమునకలై ఉన్నారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించి ఓ ఆసక్తికర కబురు బయటకొచ్చింది. ఈ కొత్త చిత్రాన్ని జులైలో పట్టాలెక్కిం చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మైత్రీకి చెందిన నిర్మాతల్లో ఒకరైన చెర్రీ వెల్లడించారు. 'రంగస్థలం' విజయం తర్వాత చరణ్ – సుక్కు కలయికలో రానున్న రెండో చిత్రం కావడంతో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. దీనికి తగ్గట్లుగానే ఈసారి సుకుమార్ తనదైన శైలిలో మరో శక్తిమంతమైన మాస్ యాక్షన్ కథను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.






# విశ్వంభర బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్

## హరిగౌరవకు అప్పగించిన చిత్రబృందం

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా సోషియో–ఫాంటసీ చిత్రం విశ్వంభరపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న చిరంజీవి, ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'బింబిసార'తో సక్సెస్ అందుకున్న దర్శకుడు మల్లిడి వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది. పురాణాల నేపథ్యంలో 14 లోకాల కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం విజువల్ వండర్‌గా నిలవనుందని చిత్రబృందం చెబుతోంది. లోకాలను కాపాడే రక్షకుడిగా చిరంజీవి వింటేజ్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. ఈ సినిమాలో చిరంజీవికి జోడీగా త్రిష కృష్ణన్ నటిస్తోంది. దాదాపు దశాబ్దం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటం విశేషం. అలాగే ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జూలై 10న ఈ చిత్రం విడుదలయ్యే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో ఆసక్తికర మార్పు చోటుచేసుకుంది. ఇప్పటికే ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం, నేపథ్య సంగీతం బాధ్యతలను యువ సంగీత దర్శకుడు హరి గౌరకు అప్పగించినట్లు తెలుస్తోంది. పాటల కంపోజిషన్‌ను కీరవాణి చూసుకుంటుండగా, భారీ యాక్షన్ సన్నివేశాలు, ఫాంటసీ ఎలిమెంట్స్‌కు పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించే బాధ్యతను హరి గౌర తీసుకున్నారని సమాచారం. ఇప్పటికే ఆయన తన పనిని ప్రారంభించారని సినీ వర్గాలు చెబుతున్నాయి. హరి గౌర గతంలో చేసిన ప్రాజెక్టులు ఆయన ప్రతిభను నిరూపించాయి. ముఖ్యంగా హనుమాన్ చిత్రానికి అందించిన సంగీతం మంచి ప్రశంసలు అందుకుంది. అలాగే 'మిరాయ్' వంటి సినిమాలకు ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. మెలోడీస్‌తో పాటు గూస్‌బమ్స్ తెప్పించే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇవ్వడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో 'విశ్వంభర'లో హరి గౌర ఎంట్రీ సినిమాకు మరో ప్లస్ పాయింట్‌గా మారనుందని ఇండస్టీ వర్గాలు భావిస్తున్నాయి. భారీ విజువల్స్‌తో వస్తున్న ఈ చిత్రానికి ఆయన ఇచ్చే నేపథ్య సంగీతం ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# 'టాక్సిక్'లో బోల్డ్ సీన్స్ వివాదం ...

## కియారా అద్వానీ క్లారిటీతో పుకార్లకు చెక్

కన్నడ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'టాక్సిక్' చుట్టూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీ పాత్రకు సంబంధించిన బోల్డ్ సన్నివేశాలపై వచ్చిన వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. సినిమాలో తనపై చిత్రీకరించిన కొన్ని హాట్ సీన్స్‌ను తొలగించమని లేదా మార్చాలని కియారా మేకర్స్‌ను కోరిందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. టీజర్‌లో కనిపించిన గ్లామరస్ విజువల్స్ కారణంగా ఈ వార్తలకు మరింత ఊపు వచ్చింది. దీంతో సినిమాలో ఘాటైన సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయన్న అంచనాలు ప్రేక్షకుల్లో పెరిగాయి. అయితే ఈ మొత్తం ప్రచారంపై కియారా అద్వానీ స్వయంగా స్పందిస్తూ స్పష్టమైన క్లారిటీ ఇచ్చింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించిన ఆమె.. "నేను ఎలాంటి సన్నివేశాల విషయంలోనూ మార్పులు కోరలేదు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమైన పుకార్లే" అని పేర్కొంది. దీంతో ఈ వివాదానికి పూర్తిగా తెరపడినట్లైంది. ఈ చిత్రం టీజర్ విడుదలైనప్పటి నుంచి కియారా పాత్ర చుట్టూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆమె లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు, సినిమా కథపై కూడా ఆసక్తిని పెంచింది. అయితే అధికారిక సమాచారం లేకుండానే పుట్టుకొచ్చిన ఊహాగానాలు ఒక్కసారిగా వైరల్ కావడం ఈ ఘటన ద్వారా మరోసారి స్పష్టమైంది. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. యష్ -- కియారా కాంబినేషన్ కూడా సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది. మొదట ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ప్రస్తుతం కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. అభిమానులు ఈ అప్డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో ధృవీకరించని వార్తలు ఎంత వేగంగా వ్యాప్తి చెందుతాయో 'టాక్సిక్' వివాదం మరోసారి నిరూపించింది. అధికారిక ప్రకటనలు లేకుండా వచ్చే వార్తలను నమ్మడంలో జాగ్రత్త అవసరమని ఈ సంఘటన సూచిస్తోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com